


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి శనివారం 25-03-2023 సంపుటి : 04 సంచిక : 181 పేజీలు : 4 వెల : రూ 3-00


## అమరావతిలో జరిగిన నిర్మాణాల్లో భారీ అవినీతి: సీఎం జగన్



అమరావతి: చంద్రబాబు హయాంలో అమరావతిలో జరిగిన నిర్మాణాల్లో భారీ అవినీతి జరిగిందన్నారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చంద్రబాబు హయాంలో జరిగిన చర్చపై సీఎం జగన్ ప్రసంగిస్తూ..మొదటిసారిగా ఐటీ సోదాలు షాపూర్ జీ పల్లోంజి ప్రతినిధి మనోజ్ అనే వ్యక్తి మీద జరిగాయి. నవంబర్ 2019 జరిగాయి. అక్కడి నుంచి ఐటీ శాఖకు సమాచారం దొరికింది. ఆ తర్వాతే చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌పై ఐటీ దాడులు చేసింది. చంద్రబాబు పీఏ శ్రీనివాస్, మనోజ్‌వాసుదేవ్‌తో కలిసి డీల్ చర్చించారు. బోగస్ కంపెనీలతో నిధులు మళ్లించారు. ఎల్ అండ్ టీ నుంచి కూడా డబ్బులు ఇప్పించేందుకు మనోజ్ ప్రయత్నించారు. మనోజ్ దుబాయ్‌లో సీబీఎన్‌కు రూ. 15.14 కోట్లు చెల్లించినట్లు తెలుస్తోంది. రామోజీరావు కొడుకు వియ్యంకుడు రఘు కూడా దీంట్లో భాగస్వామి అని సీఎం జగన్ పేర్కొన్నారు. ఇక ఈ(వైఎస్సార్‌సీపీ) ప్రభుత్వంలో లంచాలకు అవకాశం లేదన్న సీఎం జగన్.. బటన్ నొక్కగానే లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతున్నాయని స్పష్టం చేశారు. మరి గత ప్రభుత్వ హయాంలో ఈ సంక్షేమం ఎందుకు జరగలేదని నిలదీశారాయన.

## సీఎం జగన్‌ను ఎవరు వ్యతిరేకించినా వారికే నష్టం: మంత్రి రోజా

విజయవాడ: సీఎం జగన్‌ను ఎవరు వ్యతిరేకించినా వారికే నష్టమని మంత్రి ఆర్కే రోజా అన్నారు. సీఎం జగన్ తన సొంత చరిష్మాతో ఎమ్మెల్యేలను గెలిపించుకున్నారని, చంద్రబాబు 23 మంది ఎమ్మెల్యేలను లాక్కునప్పుడు ఏం జరిగిందో అందరికీ తెలుసన్నారు. వైశ్రాయ్ హోటల్లో మొదలు పెట్టిన వెన్నుపోటు రాజకీయాన్ని ఇంకా నడిపిస్తున్నారని మంత్రి రోజా మండిపడ్డారు."సీఎం అయితేనే అసెంబ్లీకి వస్తానంటూ భార్య పరువును పక్కనపెట్టి చంద్రబాబు అసెంబ్లీకి వచ్చారు. రాజకీయం అంటే అసహ్యించుకునే పరిస్థితికి టీడీపీ దిగజారింది. టీడీపీకి ఓటు వేసిన ఎమ్మెల్యేలకు భవిష్యత్తు ఉండదు. జగన్‌ను రాజకీయంగా మోసం చేసినవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారు. టీడీపీకి ఓటు వేసిన వారు పొలిటికల్‌గా సూసైడ్ చేసుకున్నట్టే. చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలను ప్రజలు తరిమికొట్టాలి" అని మంత్రి రోజా పేర్కొన్నారు.



## నలుగురు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేల సస్పెన్షన్.. అధికారిక ప్రకటన

అమరావతి: ఎమ్మెల్యే కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో.. విప్ ఉల్లంఘించినందుకు నలుగురు ఎమ్మెల్యేలను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది వైఎస్సార్‌సీపీ. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణా రెడ్డి ఏపీ అసెంబ్లీ మీడియా పాయింట్ నుంచి శుక్రవారం సాయంత్రం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విప్ ఉల్లంఘించినందుకుగానూ, క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినందుకుగానూ నలుగురు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ విధిస్తున్నట్లు ప్రకటించారాయన. ఉండవల్లి శ్రీదేవి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఆనం రాంనారాయణరెడ్డి, కోటం శ్రీధర్‌రెడ్డిపై వేటు వేస్తున్నట్లు తెలిపారు. ఈ నలుగురు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు పార్టీ గుర్తించిందని చెప్పారు సజ్జల. క్రాస్ ఓటింగ్‌పై అంతర్గత విచారణ జరిపాం. దర్యాప్తు తర్వాతే నలుగురిపై చర్యలు తీసుకున్నాం. చంద్రబాబు ఎమ్మెల్యేలను కొన్నారు. మాకున్న సమాచారం మేరకు.. డబ్బులు చేతులు మారినట్లు పార్టీ విశ్వసిస్తోంది. ఒక్కొక్కరికి రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్లకు చంద్రబాబు ఆఫర్ చేశారు. క్రాస్ ఓటింగ్ చేసినవాళ్లకు టికెట్ కూడా ఇస్తామని టీడీపీ చెప్పి ఉండవచ్చు అని సజ్జల మీడియాకు వివరించారు.



## ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందంటూ రోడ్డెక్కిన విపక్షాలు..ఢిల్లీలో ఉద్రిక్తత

కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష పార్టీలన్ని రోడ్డెక్కి ఆందోళనలు చేపట్టాయి. ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందంటూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు బ్యానర్లు చేతపట్టుకుని పార్లమెంట్ వరకు నిరసన ర్యాలీలు చేపట్టారు. అయితే పోలీసులు వీరిని అడ్డుకుని పోలీస్టేషన్‌కు తరలించారు. రాష్ట్రపతి భవన్ వైపు పాదయాత్రతో వస్తున్న విపక్ష ఎంపీలను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఢిల్లీలో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. అదానీ హిండెన్‌బర్గ్ వ్యవహారం, రాహుల్ గాంధీ అరెస్టు తదితర అంశాల నేపథ్యంలో శుక్రవారం విపక్షాలన్ని ఆందోళనకు దిగాయి. ఈ మేరకు ఈ అంశంపైనే శుక్రవారం కూడా ప్రతిపక్ష సభ్యులు ఉభయల సభల్లో ఆందోళనకు దిగడంతో ఎలాంటి చర్చలు జరగకుండానే సభలు మరోసారి వాయిదాపడ్డాయి. ఈ నేపథ్యంలోనే తొలుత పార్లమెంట్ ప్రాంగణంలోనే నిరసనలు చేపట్టిన ప్రతిపక్ష ఎంపీలు..విజయ్ చౌక్ నుంచి రాష్ట్రపతి భవన్‌వైపుకు ర్యాలీ ప్రదర్శనలు చేపట్టాయి. అయితే పోలీసులు ర్యాలీలకు అనుమతి లేదంటూ వారిని అదుపులో తీసుకున్నారు. దీంతో విజయ్ చౌక్ వద్ద ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. అదీగాక గత కొంతకాలంగా అదానీ హిండెన్‌బర్గ్ సమస్యపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)తో విచారణ చేపట్టాలని డిమాండ్ చేయడమే గాక రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశం కావాలని కోరుతున్నాయి. ఐతే దీనిపై పార్లమెంట్‌లో చర్చ జరగనివ్వకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని విపక్ష ఆరోపిస్తున్నాయి. పైగా దీని నుంచి దృష్టి మరల్చడానికే కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌పై అరెస్టు వంటి ఎత్తుగడలను ఉపయోగిస్తుందని ప్రతిపక్షాలు విరుచుకుపడ్డాయి. కేంద్ర ప్రభుత్వం రాజకీయ ప్రతీకారం తీర్చుకుంటుందంటూ విపక్షాలన్నీ దుమ్మెత్తిపోస్తున్నాయి.




## అమరావతిలో బాబు కట్టింది గోరంత.. కొట్టేసింది కొండంత: మంత్రి అమర్నాథ్



అమరావతి: రాష్ట్ర విభజన తర్వాత నెలకొన్న సంక్షోభాన్ని చంద్రబాబు తన అవినీతికి ఒక అవకాశంగా మార్చుకున్నారని, విచ్చలవిడిగా ప్రజాధనం లూటీ చేశారన్నారు ఏపీ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్. ఈ కేడీని ఏ ఈడీ పట్టుకోలేదన్న ధీమాతోనే చంద్రబాబు అడ్డగోలుగా అవినీతికి పాల్పడ్డారని తెలిపారాయన. చంద్రబాబు హయాంలో జరిగిన అవినీతిపై అసెంబ్లీలో ఇవాళ చర్చ జరిగింది. ఈ మేరకు ప్రకటన చేస్తూ.. అందుకు సంబంధించిన వివరాలను అసెంబ్లీ సాక్షిగా వెల్లడించారు మంత్రి అమర్నాథ్. గత ప్రభుత్వ హయాంలో ప్రజాధనం లూటీ చేశారు. ప్రజాధనాన్ని చంద్రబాబు దోచుకుతిన్నారు. ఏపీ సచివాలయ నిర్మాణంలో భారీ అవినీతి జరిగింది. ఆ అవినీతిపై పత్రికల్లో కథనాలు వచ్చాయి. అమరావతి ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణాల నుంచి టీడీపీ పార్టీ ఫండ్స్ కోసం డబ్బులు డిమాండ్ చేశారు. చంద్రబాబు చేసిన దోపిడీ ప్రజలకు తెలియాలి. బోగస్ ఇన్‌వాయిస్‌లతో నిధులు మళ్లించారు. ఆర్‌వీఆర్ రఘు, కృష్ణ, నారాయణ్ సంస్థలకు నిధులు మళ్లించారు. చివరగా ఆ డబ్బులన్నీ చంద్రబాబుకు చేరాయి. చంద్రబాబు, టీడీపీకి రూ.143 కోట్లు అందాయని తెలిపారు మంత్రి అమర్నాథ్. సచివాలయం, కోర్టు నిర్మాణాల్లో భారీ అవినీతి జరిగింది. చంద్రబాబు పీఏ శ్రీనివాస్ అవినీతిపై ఐటీ శాఖ నివేదిక కూడా ఇచ్చింది. అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు నిర్మాణాలను షాపూర్ జీ పల్లోంజి చేపట్టింది. మనోజ్ వాసుదేవ్ షాపూర్ జీ పల్లోంజి సంస్థ ప్రతినిధి. మనోజ్ వాసుదేవ్ 2019లో చంద్రబాబుని కలిశారు. తన పీఏ ఇచ్చే ఆదేశాలను ఫాలో కావాలని ఆయనకు బాబు చెప్పారు. చంద్రబాబు పీఏ అవినీతిపై ఐటీ శాఖ నివేదిక ఇచ్చింది. అంతేకాదు.. కొన్ని ఆధారాలు కూడా సేకరించినట్లు ఐటీ శాఖ చెప్పింది. దాదాపు రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందన్న అమర్నాథ్.. ఈ మేరకు ఓ ఆంగ్ల పత్రిక కథనాన్ని సభలో ప్రదర్శించారు. షాపూర్ జీ పల్లోంజి సంస్థకు రూ.8వేల కోట్ల విలువైన కాంట్రాక్టులు ఇచ్చారు. అమరావతిలో చంద్రబాబు కట్టింది గోరంత.. కొట్టేసింది కొండంత. దోచుకోవడానికి చంద్రబాబు అలవాటు పడ్డారని విమర్శించారు మంత్రి అమర్నాథ్.

## రూ.6,356 కోట్లు మురిగిపోయాయి: ఏపీ ఆర్థికస్థితిపై కాగ్ నివేదిక

అమరావతి: ఏపీ ఆర్థిక స్థితిగతులపై ఆడిట్ నివేదికను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) సమర్పించింది. 2022 మార్చి 31 తేదీతో ముగిసిన సంవత్సరానికి సంబంధించిన నివేదికను కాగ్ కార్యాలయం అందజేసింది. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు, రెవెన్యూ, రవాణా తదితర అంశాలపై నివేదిక ఇచ్చింది. కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా వచ్చిన రూ.6,356 కోట్ల గ్రాంట్ మురిగిపోయిందని.. గత ఏడాదితో పోలిస్తే చెల్లించాల్సిన రుణాలు రూ.24,257 కోట్ల మేర పెరిగాయని పేర్కొంది."బడ్జెటేతర రుణాలు రూ.1,18,394 కోట్లు నమోదయ్యాయి. డిస్కమ్‌లు, నీటి పారుదల ప్రాజెక్టులకు చెల్లించాల్సిన బకాయిలు మరో రూ.17,804 కోట్లు ఉన్నాయి. వీటినీ బడ్జెట్‌లో చూపకపోవడంతో కీలకమైన మౌలిక సదుపాయాల కల్పన నిధులపై శాసనసభ నియంత్రణ కోల్పోయేందుకు కారణమైంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఏపీ 18.47 శాతం జీఎస్డీపీ వృద్ధి రేటు నమోదు చేసింది. 2021లో ఏపీ ఎఫ్ఆర్బీఎం చట్టాన్ని సవరించింది. తద్వారా ఆర్థిక రుణ పరిమితి పెంచుకునే ప్రయత్నం జరిగింది. రూ.688 కోట్ల రెవెన్యూ వ్యయాన్ని మూలధన వ్యయమని తప్పుగా వర్గీకరించారు. నవరత్నాల్లో భాగంగా వైఎస్ఆర్ గృహవసతి పథకాన్ని మూలధన వ్యయంగా ప్రభుత్వం చూపింది. లబ్ధిదారులకు ఇచ్చే ఇళ్ల స్థలాలు, ఇళ్లను రెవెన్యూ వ్యయంగా చూపాల్సి ఉంది. బడ్జెట్‌లో చూపని అదనపు రుణాలు పరిమితి కంటే అధికంగా ఉన్నాయి. స్మార్ట్ పట్టణాలు, కృషి వికాస్ యోజన, జాతీయ ఆరోగ్య మిషన్ లాంటి పథకాలకు రాష్ట్ర వాటా విడుదల కాకపోవటం వల్ల అవి సరిగా అమలు కాలేదు. రూ.3540 కోట్లు విడుదల చేయాల్సి ఉన్నా రాష్ట్రం వివిధ పథకాలకు తన వాటా విడుదల చేయలేదు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో కేపిటల్ వ్యయం తక్కువగా ఉంది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వ మొత్తం అప్పులు రూ.3,72,503 కోట్లు. దీనిలో 90 శాతం మేర రుణాలు 13.99 శాతం వడ్డీ తో తీసుకున్నవే. 2018 నుంచి 2022 వరకూ అంతర్గత రుణాలు 77.54 శాతం మేర పెరిగాయి. గడచిన ఐదేళ్లలో తలసరి రుణం 61 శాతం మేర పెరిగింది.




## చంద్రబాబు సమక్షంలో తెదేపాలో చేరిన కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

మంగళగిరి: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడంపై తెదేపా అధినేత చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ గెలుపు గాలి మాత్రమేనని రాబోయే ఎన్నికల్లో సునామీ వస్తుందని వైకాపాను ఉద్దేశించి ఆయన హెచ్చరించారు. ఈ సునామీలో వైకాపా నేతలు అడ్రస్ లేకుండా కొట్టుకొనిపోవడం ఖాయమని అన్నారు. వైకాపా తిరుగుబాటు నేత, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరుడు గిరిధర్‌రెడ్డి శుక్రవారం తెలుగుదేశంలో చేరారు. చంద్రబాబు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజల్లో నిరంతరం ఉంటూ సమాజానికి సేవ చేయాలనే తపన ఉండే వ్యక్తి గిరిధర్‌రెడ్డి అని అన్నారు. వైకాపా సేవ దళ అధ్యక్షుడే రాజీనామా చేశాడంటే ఆ పార్టీ నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో మరికొందరు నేతలు తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. వారందర్నీ చంద్ర బాబు సదరంగా పార్టీలోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. "తెలుగుదేశం కుటుంబంలో నన్ను భాగస్వామిని చేసిన చంద్రబాబుకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం చాలా అవసరం. అందరి సలహాలు, సూచనలు తీసుకున్నాకే తెదేపాలో చేరాను. వచ్చే ఎన్నికల్లో నెల్లూరు జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాలను తెదేపా గెలుస్తుంది. మాతోపాటు మమ్మల్ని నమ్ముకొని ఈ పార్టీలోకి వచ్చిన వారందరికీ ధన్యవాదాలు" తెలిపారు.




## చంద్రబాబును కలిసిన పంచుమర్తి అనురాధ

అమరావతి : తెదేపా తరఫున నూతన ఎమ్మెల్సీగా ఎన్నికైన పంచుమర్తి అనురాధ ఆ పార్టీ అధినేత చంద్రబాబును ఆయన నివాసంలో కలిశారు. పార్టీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చి గెలిపించినందుకు ఆమె చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబుతోపాటు పార్టీ నేతలు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, బొండా ఉమామహేశ్వరరావు తదితరులు అనురాధకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు నిన్న జరిగిన ఎన్నికల్లో అనురాధ వైకాపాకు షాకిచ్చిన విషయం తెలిసిందే. వైకాపాకు కొందరు సొంత ఎమ్మెల్యేలే మొండి చేయి చూపి.. పంచుమర్తి అనురాధకు ఓటేసి ఘన విజయం కట్టబెట్టారు.



# సంపాదకీయం

శనివారం 25-03-2023

## రాహుల్ గాంధీకి నెక్ట్ ఏంటి?

పరువు నష్టం కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీకి గుజరాత్?లోని సూరత్? కోర్టు.. రెండేళ్ల జైలు శిక్ష విధించడం వార్తల్లో నిలిచింది. కోర్టు తీర్పుతో కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్? గాంధీపై పార్లమెంట్?లో అనర్హత వేటు పడే అవకాశం ఉందని పలువురు న్యాయ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. చట్టం ప్రకారం.. రాహుల్? గాంధీ, తన వయనాడ్? సీటును కోల్పోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు కర్ణాటకలో పర్యటించారు రాహుల్? గాంధీ. కోలర్?లో నిర్వహించిన ఓ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీపై, మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "దొంగలందరికి.. మోదీ అనే ఇంటి పేరే ఎందుకు ఉంటోంది?'' అని అన్నారు. దేశం నుంచి పారిపోయిన నీరవ్? మోదీ, లలిత్? మోదీలతో పాటు ప్రధాని నరేంద్ర మోదీకి కూడా ఈ ఇంటి పేరు ఉండటంతో.. రాహుల్? వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగింది. ఈ క్రమంలో.. 2019లో గుజరాత్?లోని సూరత్? జిల్లా కోర్టులో రాహుల్? గాంధీకి వ్యతిరేకంగా పిటిషన్? దాఖలైంది.: ఈ వ్యవహారంపై విచారణ పూర్తి చేసిన అనంతరం గురువారం కీలక తీర్పును వెలువరించింది సూరత్?లోని జిల్లా కోర్టు. రాహుల్? గాంధీని దోషిగా తేలుస్తూ.. రెండేళ్ల జైలు శిక్షను విధించింది. 30 రోజుల బెయిల్?తో పాటు తీర్పును సవాలు చేసేందుకు అవకాశాన్ని ఇచ్చింది.రాహుల్? గాంధీకి 30 రోజుల పాటు బెయిల్? లభించినా.. సూరత్? కోర్టు తీర్పుతో ఆయనపై అనర్హత వేటు పడే అవకాశం ఉందని న్యాయశాఖ నిపుణులు చెబుతున్నారు. 1951 రిప్రసెంటేటివ్? ఆఫ్? ది పీపుల్? యాక్ట్? సెక్షన్? 8(3) ప్రకారం.. పార్లమెంట్? సభ్యుడిని ఏదైనా కోర్టు దోషిగా తేలుస్తూ.. కనీసం 2ఏళ్ల జైలు శిక్ష విధించినట్టు అయితే, సంబంధిత ఎంపీపై అనర్హత వేటు పడాలి ఇక రాహుల్? గాంధీ వేసిన సెక్షన్? 499 (క్రిమినల్? డిఫమేషన్? కేసు).. చాలా అరుదైనదని న్యాయశాఖ నిపుణులు చెబుతున్నారు. ఇక సూరత్? కోర్టు తీర్పుతో.. రాహుల్? గాంధీపై అనర్హత వేటు వేసి, వయనాడ్? సీటును ఖాళీగా ఉందని ప్రకటించే అధికారం లోక్?సభ సెక్రటేరియట్?కు ఉంది. సూరత్? కోర్టు తీర్పుపై.. ఎగువ కోర్టులేవీ స్టే విధించకపోతే ఇదే జరుగుతుంది. ఈ తీర్పును ఎగువ కోర్టులు కొట్టివేయకపోతే.. మరో 8ఏళ్ల పాటు రాహుల్? గాంధీ ఎలాంటి ఎన్నికల్లోనూ పోటీచేయలేరు కూడా.సూరత్? కోర్టు తీర్పును ఎగువ కోర్టులో సవాలు చేసేందుకు రాహుల్? గాంధీ న్యాయ బృందం సన్నద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. సూరత్? తీర్పును అక్కడ కొట్టివేయకపోతే.. రాహుల్? బృందం సుప్రీంకోర్టుకు కూడా వెళ్లేందుకు సిద్ధంగా ఉందని సమాచారం. మరో వైపు పరువు నష్టం కేసులో తనకు రెండేళ్ల జైలు శిక్షను విధిస్తూ గుజరాత్? సూరత్? కోర్టు వెలువరించిన తీర్పుపై.. మహాత్మా గాంధీ వ్యాఖ్యలను ఉదహరిస్తూ స్పందించారు కాంగ్రెస్? సీనియర్? నేత రాహుల్? గాంధీ. సత్యం, అహింస తన మతం అని పేర్కొన్నారు.2019 లోక్?సభ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ రాహుల్? గాంధీకి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్?పై గురువారం తీర్పును వెలువరించింది సూరత్?లోని జిల్లా కోర్టు. రాహుల్? గాంధీని దోషిగా తేల్చింది. రెండేళ్ల జైలు శిక్షను విధించింది. 30 రోజుల పాటు బెయిల్?ను మంజూరు చేస్తూ.. తీర్పును సవాలు చేసేందుకు వెసులుబాటును కల్పించింది. ఈ వ్యవహారంపై రాహుల్? గాంధీ తాజాగా ట్వీట్? చేశారు."సత్యం, అహింస నా మతం. సత్యం అన్నది నా దేవుడు. దానిని చేరుకునేందుకు అహింస సహకరిస్తుంది- మహాత్మా గాంధీ," అని రాహుల్? గాంధీ తన ట్విట్టర్? ఖాతాలో రాసుకొచ్చారు."రాహుల్? గాంధీ గొంతుకను అణచివేసేందుకు మొత్తం యంత్రాంగం శ్రమిస్తోంది. అన్ని విధాలుగా కృషిచేస్తోంది. నా సోదరుడు ఎప్పుడు భయపడలేదు. ఎప్పుడు భయపడడు కూడా. నిజాయితీగా జీవిస్తున్నాడు. నిజమే మాట్లాడతాడు. ప్రజల తరఫు ఉంటూనే ఉంటాడు. కోట్లాది మంది భారతీయుల ప్రేమ అతని వద్ద ఉంది," అని ప్రియాంక గాంధీ అన్నారు.రాహుల్? గాంధీకి జైలు శిక్ష వ్యవహారంపై ఢిల్లీ సీఎం అరవింద్? కేజ్రీవాల్? స్పందించారు. విపక్షాన్ని అంతం చేసేందుకు కుట్ర జరుగుతోందని మండిపడ్డారు.

# ఫలించిన పెద్దాయన వ్యూహం

గుంటూరు, మార్చి 24, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు వయసులోనే కాదు.. రాజకీయ అనుభవం కూడా నాలుగు దశాబ్దాలు. ఆయన వ్యూహాలు వేరు. ఆలోచనలు వేరు. ప్రతి నిమిషమూ రాజకీయాల గురించి ఆలోచించే ఏకైక నేత చంద్రబాబు అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఎందుకంటే ప్రతి ఎన్నికను ఆయన ప్రతిష్టాత్మకంగా తీసుకుంటారు. ఏ ఎన్నికను తేలిగ్గా తీసుకోరు. ఒక నిర్ణయం తీసుకున్నారంటే లోతైన ఆలోచనను, అధ్యయనం చేస్తారు. ఇన్నాళ్లు తన టైం కలసి రాలేదని ఆయన ఊరుకున్నారా? అంటే అదీ లేదు. ప్రతి ఎన్నికలోనూ పోరాడారు. ఓడినా క్యాడర్ లో ధైర్యం నింపేందుకు రాష్ట్రమంతా కలియదిరిగారు. ఆయన వెనక బలమైన మీడియా ఉండటం కూడా కలిసొచ్చే అంశమే. అందుకే చంద్రబాబు ముందు కుప్పిగంతులు వేయడం తగదని జగన్ ఇప్పటికైనా తెలుసుకుంటే మంచిది. వైనాట్ 175 అని తాడేపల్లిలో పదే పదే ప్రకటిస్తుంటే చంద్రబాబు క్షేత్రస్థాయిలోకి వెళ్లి తన పనితాను చేసుకుంటున్నారు. ఇటీవల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు ప్రాంతాల్లోనూ టీడీపీ మద్దతిచ్చిన అభ్యర్థులను గెలిపించుకోగలిగారు. ఇక్కడా చంద్రబాబు స్ట్రాటజీ వర్క్ అవుట్ అయింది. ప్రచారం చేయకపోయినా అభ్యర్థుల ఎంపిక, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ అంతా చంద్రబాబు మినిట్ టు మినిట్ పరిశీలించారు. అందుకే విజయం సాధ్యమయింది. ఆ విజయం చూసైనా జగన్ పార్టీ మేలుకొనలేదు. చంద్రబాబును తక్కువగా అంచనా వేసింది. ఫలితం అనుభవించింది. చంద్రబాబు పార్టీ నేతల్లోనూ, క్యాడర్ లోనూ మరోసారి కాన్ఫిడెన్స్ లెవెల్స్ ను పెంచారు. ఇప్పుడు చంద్రబాబుతో ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు టచ్ లోకి వెళ్లారన్నది వైసీపీ నేతలకు అర్థం కాకుండా ఉంది. వారికి చంద్రబాబు ఏ హామీ ఇచ్చారన్నది పక్కనపెడతే ఇది వైసీపీ దారుణ వైఫ్యలం. తమ మీద నమ్మకం ఎమ్మెల్యేల్లో కల్పించలేకపోయారు. వైసీపీలో ఉన్న లుకలుకలును చంద్రబాబు సరైన సమయంలో క్యాష్ చేసుకున్నారు. అందుకే చంద్రబాబు అభ్యర్థిని నిలబెట్టినప్పుడే జగన్ జాగ్రత్త పడాల్సిందన్న కామెంట్స్ ఆ పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. కేవలం రెండు ఓట్లు, అదీ స్వయంకృతాపరాధంతోనే జగన్ కోల్పోవాల్సి వచ్చిందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. జగన్ ఎవరి మాట వినకపోవడమూ చంద్రబాబుకు కలసి వచ్చిందనే చెప్పాలి. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలపై ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు చర్యలు ప్రారంభించగానే చంద్రబాబు తన వ్యూహాన్ని మొదలుపెట్టారు. అందుకే బీసీ సామాజికవర్గం నేత పంచుమర్తి అనూరాధను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారు చేశారు. నిన్న మొన్నటి వరకూ 19 మంది ఎమ్మెల్యేలే ఉన్నారన్న విషయాన్ని చంద్రబాబు లేదు.. లేదు.. నాకు 23 మంది ఎమ్మెల్యేలున్నారని చంద్రబాబు

ఈ ఎన్నికతో చెప్పకనే చెప్పినట్లయింది. 2019 ఎన్నికలు జరిగిన తర్వాత టీడీపీకి నలుగురు ఎమ్మెల్యేలు దూరమయ్యారు. దీంతో వారి లెక్క 19కి పడిపోయింది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల సమయానికి తిరిగి చంద్రబాబును లెక్కను సరిచేశారు. 23 మంది ఎమ్మెల్యేలు తన పార్టీలో ఉన్నారని చంద్రబాబు బయటకు చెప్పగలిగారు. అందుకే చంద్రబాబు ఈ ఎన్నిక ప్రారంభం దగ్గర నుంచి హైదరాబాద్ వెళ్లకుండా ఉండవల్లిలోనే ఉండి కథ నడిపించారు. ఎవరి మాట వింటారో వారి చేత మూడో కంటికి తెలియకుండా ఎమ్మెల్యేలను తన వైపునకు తిప్పుకున్నారు. కనీసం టీడీపీ ఎమ్మెల్యేలకు కూడా ఈ విషయం తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వైసీపీ కథను సమాప్తం చేయగలిగారు. చంద్రబాబు చెప్పింది చెప్పినట్లు ఆయన టీం చేసింది. ఫలితంగా జగన్ ను చావుదెబ్బ కొట్టగలిగారు. పెద్దాయన వ్యూహం ఫలించింది. చంద్రబాబుకు ఇప్పుడు అన్నీ వరసగా కలసి వస్తున్నాయి. అందుకే ఎన్నికలకు ముందు వరస విజయాలు దక్కుతున్నాయి. ఇక టీడీపీని ఆపేదెవరు? అన్న రీతిలో చంద్రబాబు భవిష్యత్ రాజకీయ ప్రయాణం సాగనుంది.

# ఎమ్మెల్సీ ఎన్నికలు... వైసీపీలో నిరాశ

విజయవాడ, మార్చి 24, ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనూరాధ అందరి కంటే ఎక్కువగా 23 తొలి ప్రాదాన్యతా ఓట్లు తెచ్చుకోవడంతో మొదటే విజయం సాధించారు. అయితే వైఎస్ఆర్‌సీపీ నిలబెట్టిన ఏడుగురు అభ్యర్థుల్లో ఒకరు ఖాయంగా ఓటమి ఎదుర్కోవాల్సి ఉంది. మిగతా అభ్యర్థులందరికీ 22 ఓట్లు రాగా జయ మంగళ వెంకటరమణ, కోలా గురువులుకు మాత్రమే 21 ఓట్లు వచ్చాయి. వీరికి వచ్చిన ఓట్లలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించి.. కోలా గురువులును ఓడిపోయినట్లుగా ప్రకటించారు. జయ మంగళ వెంకటరమణ ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో విజయం సాధించారు. నిన్నామొన్నటి వరకూ జయ మంగళ వెంకట రమణ టీడీపీలోనే ఉన్నారు. ఆయన కైకలూరు నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఉన్నారు. రాత్రికి రాత్రే ఆయన పార్టీ మారిపోయారు. సీఎం జగన్ ఎమ్మెల్సీ హామీ ఇవ్వడంతో పార్టీ ఫిరాయించారు. మొదట స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా చాన్సిస్తారని అనుకున్నారు. కానీ తర్వాత సీఎం జగన్ వ్యూహం మార్చి ఎమ్మెల్యే కోటాలో మండలికి పంపాలని నిర్ణయించారు. చివరికి ఉత్కంఠగా ఎన్నికలు జరిగినా ఆయన పదవి నిలబెట్టుకున్నారు. దీంతో కోలా గురువులు పరాజయం పాలయ్యారు. కోలా గురువులుకు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కేటాయించడం కష్టం కావడంతో ఆయనను ఎమ్మెల్సీ చేయాలనుకున్నారు. కానీ పరిస్థితి అనూకలించలేదు. కోలా గురువులు, జయ మంగళం వెంకటరమణకు కేటాయించిన ఎమ్మెల్యేల్లో ఇద్దరు క్రాస్ ఓటింగ్ చేశారు. ఇప్పుడు వారికి కేటాయించిన ఎమ్మెల్యేలందరిపై వైసీపీ హైకమాండ్ అనుమానపడే అవకాశం ఉంది. ప్రధానంగా వారిలో ఎవరు పార్టీపై అసంతృప్తితో ఉన్నారన్న అంశం ఆధారంగా క్రాస్ ఓటింగ్ కు పాల్పడింది ఎవరనే దానిపై వైఎస్ఆర్‌సీపీ హైకమాండ్ ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది.

మొత్తం ఏడు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలను గెలుస్తామని గట్టి నమ్మకం పెట్టుకున్న వైసీపీకి ... ఆ పార్టీ హైకమాండ్‌కు ఏదీ కలసి రావడం లేదు. పక్కా జాగ్రత్తలు తీసుకున్నా.. ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేయకుండా ఆపలేకపోయారు. టీడీపీ నుంచి వచ్చి చేరిన నలుగురు, జనసేన నుంచి వచ్చి చేరిన ఒకరితో గెలుపు ఖాయమనుకున్నారు కానీ.. తమ పార్టీ ఎమ్మెల్యేలు షాకిస్తారని అనుకోలే?దు. ఈ పరిణామాలపై వైఎస్ఆర్‌సీపీలో విస్తృత చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యేలపై సీఎం జగన్ పట్టు కోల్పోయారా అన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఈ ఓటమిపై ఇంకా వైఎస్ఆర్‌సీపీ ఎలాంటి స్పందనా వ్యక్తం చేయలేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ గెలుస్తామనుకున్న ఎమ్మెల్సీ సీట్లలో ఓడిపోవడంతో వైసీపీ క్యాడర్ నిరాశలో కూరుకుపోయింది. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారు ఐదుగురు ఓట్లేసినా తమ ఎమ్మెల్యేలే క్రాస్ ఓటింగ్ చేయడం వారిని ఇబ్బంది పెడుతోంది.

# మైండ్ గేమ్ తో టీడీపీ స్కెచ్

విజయవాడ, మార్చి 24, జనాలకు ఎలాంటి ఆసక్తి లేని ఎమ్మెల్సీ ఎన్నికలకి కూడా మంచి ఊపు తీసుకొచ్చాయి వైసీపీ, తెలుగుదేశం. ఎప్పుడూ ఈ ఎన్నికలు చాలా సైలెంట్‌గా అసలు జరిగాయా లేదా అన్నట్టు సాగిపోయేవి. అద్భుతాలు జరిగే ఆ ఒక్కరోజు మాత్రమే చర్చలో ఉండేవి. కానీ ఈసారి ఏపీలో జరిగిన కొన్ని ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలు మాత్రం చాలా టెన్షన్ పెట్టాయి. నోటిఫికేషన్ పడినప్పుడు కనిపించని టెన్షన్ ఫలితాలు రోజున మాత్రం పీక్స్‌కు వెళ్లింది. సాధారణ ఎన్నికలకు ఉన్న హైప్ వచ్చింది. అదే టెంపోను ఎమ్మెల్యే కోట ఎన్నికల్లో కూడా కనిపిస్తోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ ఓటమిపాలైంది. అప్పటికే ఎమ్మెల్సే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో ఉన్న టీడీపీ తన వ్యూహానికి మరింత పదును పెట్టింది. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ఓటమి బాధలో ఉన్న వైసీపీ మరింత కలవర పెట్టేందుకు ప్లాన్ చేసింది. ఆ పార్టీలో చాలా మంది అసంతృప్త ఎమ్మెల్యేలు ఉన్నారని.. వారి కచ్చితంగా తమకే ఓటు వేస్తారని బాంబు పేల్చింది. ఇప్పటికే కోటం రెడ్డి, ఆనంరాంనారాయణ రెడ్డి లాంటి వారితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న వైసీపీ మరింత అలర్ట్ అయింది. ఓ వైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతన్న టైంలోనే తమ వైపు నుంచి ఎలాంటి తప్పు జరగకుండా ఒక్క ఓటు కూడా వృథా పోకుండా ఉండేలా ప్లాన్ చేసింది. అసలు వైసీపీకి వ్యతిరేకంగా ఓటు వేసేది ఎవరో... అలాంటి ఆలోచనతో ఎవరు ఉన్నారో తెలియదు కానీ అధికార పార్టీ మాత్రం పరుగులు పెట్టింది. మాక్ పోలింగ్ పేరుతో ఎమ్మెల్యేలకు శిక్షణ ఇచ్చింది. ఎలా ఓటు వేయాలి... అంటూ ఒకటికి పదిసార్లు చెప్పింది. ఒక్కో ఎమ్మెల్సీ అభ్యర్థికి 22 మంది ఎమ్మెల్యేలను కేటాయించింది. వారంతా ఆ ఎమ్మెల్సీకే ఓటు వేయాలని మాక్ పోలింగ్‌లో చెప్పారు. అంతే కాదు.. ఆ ఎమ్మెల్యేల నుంచి తప్పు జరగకుండా మంత్రులను కూడా వారికి అటాచ్ చేసింది. ఇలా వారం రోజుల నుంచి అధికార పార్టీ జాగ్రత్త పడుతూ వచ్చింది. అంతే కాదు... కాస్త అసంతృప్తిగా ఉన్న ఎమ్మెల్యేల ఫ్యామిలీలతో కూడా మాట్లాడినట్టు ప్రచారం జరుగుతోంది. స్వయంగా సీఎం జగన్ రంగంలోకి దిగి కొందరి ఎమ్మెల్యేలతో చర్చలు జరిపినట్టు కూడా టాక్ నడుస్తోంది. కావాల్సిన పనులకు కూడా ఆమోదం తెలిపారన్న వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇలా ఏ చిన్న తప్పు జరగకుండా ప్లాన్ చేశారని తెలుస్తోంది. ఇదంతా ముందు జాగ్రత్త అంటున్నారు వైసీపీ నేతలు. తాము పన్నిన వ్యూహంలో వైసీపీ చిక్కుకుందని.. జాగ్రత్త పడి ఎమ్మెల్యేల పనులు చేసిందని.. పరుగులు పెట్టిందని విమర్శిస్తున్నారు టీడీపీ నేతలు. పోలింగ్‌కు కొన్ని గంటల ముందు గంటా రాజీనామా ప్రచారంతో అధికార పార్టీ మైండ్ గేమ్. ఎప్పుడో రెండేళ్ల క్రితం స్టీల్ ప్లాంట్ ఉద్యమంలో పాల్గొంటానని చెప్పి రాజీనామా చేసిన గంటా ఎపిసోడ్‌ను తమకు అనుకూలంగా మార్చుకుంది వైసీపీ. దాన్ని స్పీకర్ ఆమోదించారని... గంటాకు ఓటు వేసే హక్కు లేదంటూ ప్రచారం మొదలు పెట్టింది. దీంతో టీడీపీ శ్రేణుల్లో కాస్త అలజడి రేగింది. ఓటర్ లిస్టు రెడీ అయిందని... ఈ టైంలో రాజీనామా ఆమోదించినా నష్టం లేదంటూ క్లారిటీ ఇచ్చింది టీడీపీ. గంటా శ్రీనివాసరావు నిర్భయంగా ఓటు వేసుకోవచ్చని కూడా చెప్పింది. దీంతో గంటా రాజీనామా ఆమోదం ప్రచారానికి తెరపడింది. ఓటు వేసిన తర్వాత తన రాజీనామా ఆమోదంపై క్లారిటీ ఇచ్చారు. ఇదంతా వైసీపీ చేసిన దుష్ప్రచారంగా కొట్టిపారేశారు. గంటా రాజీనామా ఆమోదం ప్రచారానికి విరుగుడుగా టీడీపీ మరో ప్రచారాన్ని మొదలు పెట్టింది. 16 మంది ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారంటూ బాంబు పేల్చింది. వాళ్లంతా వైసీపీకి వ్యతిరేకంగా ఓటు వేస్తున్నారని ప్రచారం మొదలు పెట్టారు. టీడీపీ పోలింగ్ ఏజెంట్ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలోనూ తెలుగుదేశం అభ్యర్థి గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. అంతరాత్మ ప్రభోదానుసారం వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యేలు తమకు ఓటు వేయబోతున్నారని అన్నారు. వైఎస్ఆర్ సీపీలో అసంతృప్తితో ఉన్న 16 మంది ఎమ్మెల్యేలు తమకు టచ్‌లోనే ఉన్నారని అన్నారు. పట్టభద్రుల ఎన్నిక తర్వాత వైఎస్ఆర్ సీపీ మునిగిపోయే పడవ అని సొంత పార్టీ ఎమ్మెల్యేలే గ్రహించారని అన్నారు. ఎమ్మెల్యే కోటాలో ఝలక్ ఇస్తేనే జగన్ మారతారనే భావనలో చాలా మంది ఎమ్మెల్యేలు ఉన్నారని అన్నారు. సీక్రెట్ ఓటింగ్‌లో ఎవరు ఎవరికి వేశారో తెలిసే అవకాశమే లేదని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు.

# నట్టేట ముంచిన నమ్మకం

విజయవాడ, మార్చి 24, పెత్తనం పాయసంలాగా తియ్యగా ఉంటుంది. ఆ పెత్తనమే దూరమైతే.. అదే జరిగింది. దాని ఫలితమే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ ఓటమి. ఎమ్మెల్యేలు పెత్తనానాకి దూరమయ్యారు. లీడర్ అంటే వ్యూహాలు ఉండాలి. తగ్గి ఉండాలి. అంతే తప్ప తన బొమ్మతోటే గెలిచారనుకుని ఎమ్మెల్యేలను తక్కువగా చూస్తే దాని ప్రతిఫలాన్ని సరైన టైం వచ్చినప్పుడు వాళ్లు చూపిస్తారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇప్పుడు అదే ఎదుర్కొంటున్నారు. ఆయన ఎమ్మెల్యేలకు అపాయింట్‌మెంట్ ఇవ్వరు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి తమ బాధలను వైసీపీ ఎమ్మెల్యేలను చెప్పుకోవాల్సిందే. కనీసం సీఎంవో కూడా వారి బాధలను వినరు. దీంతో ఎమ్మెల్యేలు గత కొంతకాలంగా అసంతృప్తితోనే ఉన్నారు. తమకు ఎలాంటి అధికారాలు లేకుడా బొమ్మలుగా మార్చారన్న వ్యాఖ్యలు వైసీపీ ఎమ్మెల్యేల నుంచి వినిపించాయి. ఇక నియోజకవర్గాల్లో విభేదాలు మామూలుగా లేవు. ఎస్సీ రిజర్వడ్ నియోజకవర్గాల్లో ఎక్కువగా ఉంది. ప్రతి నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ప్రతిగా మరొకరిని వైసీపీ హైకమాండ్ ప్రోత్సహిస్తుంది. దీంతో నేతల మధ్య విభేదాలను జగన్ పరిష్కరించే ఆలోచన చేయలేదు. పోనీ టీడీపీ నుంచి వచ్చిన నలుగురు ఎమ్మెల్యేలను తమ పార్టీ నేతలుగా చూశారా? అంటే అదీ లేదు. అక్కడ వైసీపీ నేతలు రెచ్చిపోతున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. కొత్తగా పార్టీలో చేరిన వారికి కూడా ఎమ్మెల్సీ పదవులు, నామినేటెడ్ పదవులు ఇచ్చారు. మరోవైపు జగన్ గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం పేరుతో టార్చర్ పెట్టారంటున్నారు. వాలంటీర్ల వ్యవస్థను పెట్టారు. లబ్దిదారుల ఎంపిక నుంచి పథకాల చేర వేసే వరకూ వాళ్లే చూసుకుంటారు. ఇక డీబీటీ పథకం కింద నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో జగన్ తాడేపల్లి నుంచి డబ్బులు పంచుతున్నారు. ఇక ఎమ్మెల్యేలకు ఏం విలువ ఉఃటుంది. అందుకే గడప గడపకు ప్రభుత్వంలో ఎమ్మెల్యేలను ప్రజలు లెక్క చేయలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతూ వస్తుంది. కానీ జగన్ తనను దాటి ఎవరూ వెళ్లరన్న గుడ్డినమ్మకంతో ఉన్నారు. అదే సమయంలో కొందరికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ రాదంటూ వారి పేర్లను కూడా నేరుగా చదివి వినిపించడం కూడా కొందరికి చిరాకుగా మారింది. ఇవన్నీ చంద్రబాబుకు కలసి వచ్చాయి. ఇక ఎన్నికలకు ఏడాది మాత్రమే సమయం ఉంది. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యేలు కూడా తమ రాజకీయ భవిష్యత్ ను తాము చూసుకుంటారు. అందుకే ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు ఖచ్చితంగా చంద్రబాబుతో టచ్ లోకి వెళ్లుంటారు. చంద్రబాబు నుంచి భరోసా తీసుకున్న తర్వాతే క్రాస్ ఓటింగ్ కు ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు పాల్పడ్డారన్నది వాస్తవం. తాడేపల్లిలో కూర్చుని రాజకీయం చేద్దామంటే జగన్ కు సార్వత్రిక ఎన్నికలకు ముందు రెండు అపజయాలు ఎదురయ్యాయి. ఇంటలిజెన్స్ వ్యవస్థ ఏమయినట్లు? అన్న కామెంట్స్ కూడా పార్టీ నుంచి వినిపిస్తున్నాయి. అవతల ప్రత్యర్థి చంద్రబాబు. నలభై ఏళ్ల అనుభవం ఉండి, వ్యూహాలు..ఎత్తులు పై ఎత్తులు ఎలా వేయాలో తెలుసు. అయినా జగన్ అండ్ టీం మరోసారి నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది.

# చట్టాలతో కోర్టు తరలింపా..

గుంటూరు, మార్చి 24 ఏపీ హైకోర్టును తరలించాలంటే హైకోర్టుతో కలిసి రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కేంద్ర స్పష్టం చేసింది. తెలుగుదేశం పార్టీ ఎంపీ కనమేడల రవీంద్రకుమార్ రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర న్యాయమంత్రి కిరణ్ రిజుజు సమాధానం ఇచ్చారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్ర హైకోర్టు అమరావతి లో ఏర్పాటైందన్నారు. హైకోర్టును కర్నూల్ కు తరలిచాంలంటే హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వం కలిసే నిర్ణయం తీసుకోవాలని ఇందులో కేంద్రం పాత్ర లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తరలింపు ప్రస్తుతం న్యాయస్థానాల పరిధిలో ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 214 నిబంధన ప్రకారం 2018లో కేంద్రం వర్సెస్ దన్ గోపాల్ రావు, ఇతరుల కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం అమరావతిలో ఏపీ హైకోర్టు ఏర్పాటు అయిందని కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ కు ఉమ్మడి హైకోర్టుగా ఉన్న అప్పటి హైదరాబాద్ హైకోర్టు, అప్పటి రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి పునర్విభజన చట్టం ప్రకారం ఏపీ హైకోర్టు అమరావతిలో ఏర్పాటయిందన్నారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి హైకోర్టును అమరావతి నుంచి కర్నూలుకు తరలించేందుకు ప్రతిపాదించారని, సీఎం జగన్ మూడు రాజధానుల ప్రతిపాదలను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు అయ్యాయని కిరణ్ రిజిజు అన్నారు. మూడు రాజధానుల అంశంపై ఏపీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంతో పాటు రాజధాని అమరావతి నగరంలో, పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిని చేపట్టాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజినల్ డెవలప్‌మెంట్ అథారిటీని ఆదేశించిందన్నారు. హైకోర్టు తరలింపుపై రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు అభిప్రాయాలు వెల్లడించాల్సి ఉందని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. కర్నూలుకు హైకోర్టు తరలిస్తామని ఏపీ ప్రభుత్వం చట్టం చేసింది. కానీ అడుగు ముందుకు పడలేదు. నిజానికి అసెంబ్లీకి హైకోర్టును తరలించే అధికారం లేదని చట్టం చేసినంత మాత్రాన హైకోర్టును తరలించలేరన్న న్యాయనిపుణులు స్పష్టం చేశారు. న్యాయస్థానాలు ఎక్కడి నుంచి పని చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేయలేరని చెబుతున్నారు. అయితే మూడు రాజధానుల బిల్లును రాష్ట్ర ప్రభుత్వంవెనక్కి తీసుకుంది. న్యాయరాజధాని అనే అంశాన్ని ప్రస్తుతం పెద్దగా పట్టించుకోడం లేదు. సుప్రీంకోర్టులో కూడా న్యాయరాజధాని అంశాన్ని పక్కన పెట్టామని ప్రభుత్వ తరపు లాయర్ వాదించారు. ఇప్పుడు హైకోర్టు చట్ట ప్రకారమే ఏర్పాటయిందని... తరలించాలంటే.. హైకోర్టుతో కలిసి నిర్ణయం తీసుకోవాల్సి ఉందనికేంద్రం స్పష్టం చేసింది.

# నష్టాల బాటలో పౌల్ట్రీ రైతులు

ఏలూరు, మార్చి 24, చికెన్ ధరలు నేలను తాకాయి. కోడి గుడ్డు ధరలూ క్రమంగా పతనమవుతున్నాయి. దీంతో, పౌల్ట్రీ రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రెండ్రోజులుగా కేజీ చికెన్ లైవ్ ధర రూ.80 నుంచి రూ.44కు పడిపోయింది. రిటైల్ మార్కెట్లో రూ.90 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. కోడి గుడ్డు పేపరు ధర రూ.4.13 ఉండగా తొమ్మిది పైసలు కమిషన్‌పోను రైతుకు రూ.4.04 మాత్రమే దక్కుతోంది. చికెన్ లైవ్ ధర కనీసం రూ.80, కోడి గుడ్డు ధర రూ.5.50 లేనిదే గిట్టుబాటు కాదని రైతులు వాపోతున్నారుఉమ్మడి జిల్లాలో వ్యవసాయం తరువాత పెద్ద పరిశ్రమగా పౌల్ట్రీ ఉంది. సుమారు 300 పౌల్ట్రీ ఫారాలు ఉన్నాయి. దాదాపు 1.40 కోట్ల కోళ్ల పెంపకం అవుతోంది. రాష్ట్రంలో ఐదు కోట్ల వరకూ కోళ్ల ఉత్పత్తి జరుగుతోంది. దీనిలో 30 శాతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచే ఉంది. ఈ రంగంలో ప్రత్యక్షంగా 20 వేలమంది, పరోక్షంగా మరో 20 వేల మంది మొత్తం 40 వేల మంది ఉపాధి పొందుతున్నారు. ఈ పరిశ్రమకు లారీ పరిశ్రమ అనుబంధంగా ఉపాధి పొందుతోంది. రైతుల వద్ద కోళ్లను కొనుగోలు చేసిన వారు లారీల్లో ఒడిశా, బీహార్, బెంగాల్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటాయి. ఈ రాష్ట్రాలకే ఆంధ్ర నుంచి అత్యధికంగా కోళ్లు ఎగమతి అవుతుంటాయి. ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లో పౌల్ట్రీకి ప్రభుత్వాలు ప్రోత్సాహం ఇస్తున్నాయి. ఫలితంగా ఒడిశా, బీహార్, బెంగాల్ రాష్ట్రాల్లో పౌల్ట్రీ ఉత్పత్తి ఘననీయంగా పెరిగింది. ఈ ప్రభావం జిల్లాలోని పౌల్ట్రీ పరిశ్రమపై పడింది. ఇక్కడి నుంచి ఎగుమతులు తగ్గిపోయాయి. ఉత్పత్తికి తగినట్లుగా ఎగుమతులు లేకపోవడంతో ధరల పతనమయ్యాయి. వారం రోజుల వరకూ కెజీ చికెన్ ధర (స్కిన్ లెస్) రూ.220 ఉండేది. ప్రస్తుతం రూ.140 ఉంది.కోళ్ల పెంపకానికి మొక్కజొన్న, సోయా దాణాను అధికంగా వాడుతుంటారు. మొక్కజొన్న దాణా టన్నుకు ఏడాదిలో రూ.18 వేల నుంచి రూ.25 వేలు, సోయా రూ.50వేల నుంచి రూ.80 వేలకు పెరిగింది.

# ప్రచారం పటాటోపమే కొంప ముంచిందా...

విజయవాడ, మార్చి 24, ఆంధ్రప్రదేశ్‌లో అధికార పార్టీకి సొంత మీడియా ఉండటంతో ప్రచారంతో పనేముందన్నట్లు ఇన్నాళ్లు వ్యవహరించింది. దీనికి తోడు ఏపీలో ఉన్న రాజకీయ పరిస్థితులతో మీడియా మొత్తం తమ పార్టీకి వ్యతిరేకమనే భావన ఆ పార్టీ పెద్దల్లో మొదటి నుంచి ఉంది. మీడియా అండదండలు లేకపోయినా సొంతంగా అధికారంలోకి రావడానికి కార్యకర్తలు, అభిమానులు పుష్కలంగా ఉండటమే కారణమని భావించారు. దీంతో మీడియాను అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏపీ ప్రభుత్వం దూరం పెడుతూ వచ్చింది.ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే వాటితో తప్ప మిగిలిన సంస్థలతో ఏపీ ప్రభుత్వ పెద్దలు మొదటి నుంచి అంటి ముట్టనట్టే వ్యవహరించారు. దీంతో నాలుగేళ్లలో కావాల్సినంత నష్టం జరిగిపోయింది. ప్రభుత్వానికి మీడియా సంస్థలు వ్యతిరేకంగా ఉన్నాయని పదేపదే చెప్పడం ద్వారా నష్టనివారణ చేస్తున్నామని భావించారే తప్ప ప్రతి వ్యూహాలను మాత్రం సిద్ధం చేసుకోలేకపోయారు.ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తర్వాత వైసీపీ నాయకులు గతంలో చేసిన పొరపాట్లను బేరీజు వేసుకుని జరిగిన లోపాలను గుర్తిస్తున్నారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగానే తాము కూడా వ్యవహరించామని అంతర్గత సంభాషణల్లో అంగీకరిస్తున్నారు.ఏపీలో ప్రభుత్వ ప్రచారం అంటే ఆ పూటకు ట్విట్టర్‌లో ట్రెండ్ చేయడమే పెద్ద యజ్ఞంలా భావిస్తున్నారు. ట్విట్టర్ వినియోగించే జనం ఎంతమంది, ట్విట్టర్ వినియోగదారుల్లో ఓటర్లు ఎందరు, సోషల్ మీడియా ప్రచారాలతో సామాన్యులు ఎంత వరకు ప్రభావితం అవుతారు అనే సంగతి పట్టించుకోకుండా ట్రెండ్ లు చేయడం, జబ్బలు చరుచుకోవడం అధికార పక్షానికి అలవాటై పోయింది. ఈ సోషల్ మీడియా ట్రెండ్‌లు, వాటి ప్రభావం ఎంతనేది మాత్రం ఎవరికి తెలీదు.ప్రస్తుతం వైసీపీకి ఒకటికి నాలుగైదు సోషల్ మీడియా విభాగాలున్నాయి. పార్టీ సోషల్ మీడియా విభాగంతో పాటు డిజిటల్ కార్పొరేషన్, ఐ ప్యాక్ కాంపెయిన్ వింగ్, పార్టీ ఐటీ వింగ్‌తో పాటు ప్రభుత్వానికి చెందిన ఐ అండ్ పిఆర్ కూడా ప్రచార బాధ్యతలు నిర్వహిస్తోంది. వీటి మీద ప్రభుత్వం పెద్ద ఎత్తున ఖర్చు చేస్తోందికోట్లు ఖర్చు పెట్టిన గతంలో ఎందుకు ఫలితాన్నివ్వడం లేదనే ప్రశ్న అందరిలోను ఉంది. పార్టీ కోసం స్వచ్ఛంధంగా పనిచేసిన వారిని నిర్లక్ష్యం చేస్తున్నారంటూ? ఇటీవల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఫలితాలు వెలువడిన సమయంలో కార్యకర్తలు బహిరంగంగానే సోషల్ మీడియాలో విమర్శలు గుప్పించారు. పార్టీ కోసం పనిచేసిన వారిని కాదని, పార్టీ అధికారంలోకి రాగానే వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై పలువురు సోషల్ మీడియా ఖాతాల్లో విమర్శలకు దిగారు. అదే సమయంలో టీడీపీ, జనసేన సోషల్ మీడియా విభాగాలు దూకుడు ప్రదర్శిస్తున్నాయి.ప్రభుత్వ వైఫల్యాలపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ప్రతి పక్ష పార్టీలకు, అధికార పార్టీలకు మధ్య గణనీయంగా వ్యత్యాసం కనిపిస్తోంది. టీడీపీ సొంతంగా వీడియో కంటెంట్ తయారు చేయించి ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ట్విట్టర్ ఖాతాల్లో విడుదల చేస్తోంది. ప్రభుత్వ విధానాలపై వ్యంగ్యంతో కూడిన కంటెంట్ తయారు చేసి విడుదల చేస్తున్నారు. వైసీపీ సోషల్ మీడియా ఖాతాల్లో రోజు వారీ ప్రభుత్వ కార్యకలాపాలను ప్రచారం చేయడానికి పరిమితం అవుతున్నాయి. కనీసం ప్రతిపక్షాల విమర్శలను తిప్పి కొట్టలేకపోయాయని గతంలో అధికార పార్టీ తరపున ఉత్సాహంగా పని చేసిన నాయకుడు తెలిపారు. పార్టీ నుంచి ప్రోత్సాహం, గుర్తింపు లేకపోవడం, చాలామంది కోర్టు కేసులు ఎదుర్కోవాల్సి రావడంతో గతంలో ఉన్నంత ఉత్సాహంగా పనిచేయట్లేదని గుర్తు చేశారు.

## రాముడు అందరి వాడు-ఫరూక్ అబ్దుల్లా

శ్రీనగర్, మార్చి 24, (న్యూస్ పల్స్)జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా మరోసారి రాముడిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలందరికీ మంచి మార్గంలో నడిపించేందుకు శ్రీరాముడిని స్వయంగా అల్లాయే పంపాడని అన్నారు. రాముడు అందరి దేవుడు అని వెల్లడించారు. ఓ ర్యాలీలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "రాముడు కేవలం హిందువులకు మాత్రమే దేవుడు కాదు. అలాంటి ఆలోచనను పక్కన పెట్టేయండి. రాముడు అందరివాడు. అందరికీ ఆయన దేవుడే. ముస్లిమైనా, క్రిస్టియనైనా...అంతెందుకు అమెరికన్ అయినా, రష్యన్ అయినా నమ్మకం ఉన్న ప్రతి ఒక్కరికీ ఆయన దేవుడే" – ఫరూక్ అబ్దుల్లా, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఇదే సమయంలో పాకిస్థానీ రచయిత చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు ఫరూక్ అబ్దుల్లా. "ఎవరైతే తాము రాముడి భక్తులం అని చెప్పుకుంటూ తిరుగుతున్నారో వాళ్లంతా మూర్ఖులే. కేవలం ఆయన పేరు చెప్పుకుని బతికేస్తున్నారంతే. వాళ్లకు రాముడిపై భక్తి, ప్రేమ ఉండవు. కేవలం అధికారం కోసమే అలా మాట్లాడుతుంటారు"

– ఫరూక్ అబ్దుల్లా, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి

జమ్ముకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించే సమయంలో ప్రజల దృష్టిని మరల్చేందుకు అదే సమయంలో అయోధ్య రామ మందిరాన్ని ప్రారంభించే అవకాశాలున్నాయని అన్నారు. జమ్ము కశ్మీర్ ఎన్నికల కోసం కేంద్రం భారీ మొత్తంలో ఖర్చు చేసే అవకాశముందని చెప్పారు. హిందువులంతా ప్రమాదంలో ఉన్నారని ప్రచారం చేస్తారని..అలాంటి మాటల్ని పట్టించుకోవద్దని సూచించారు. గతంలోనూ ఫరూక్ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. "రాముడు అందరివాడు. ఆయనను హిందూ మతానికే పరిమితం చేయాల్సిన అవసరం లేదు" అని వెల్లడించారు. ఏ మతమూ చెడు నేర్పించదని, ప్రజలే అలా తయారవుతారని తెలిపారు. "మాపై నిత్యం ఆరోపణలు చేస్తూనే ఉంటారు. కానీ మేమెప్పుడూ పాకిస్థాన్ సైడ్ తీసుకోలేదు. వారితో ఎప్పుడూ స్నేహం చేయలేదు. మా నాన్నను కలవడానికి జిన్నా వచ్చారు. కానీ మేము కనీసం ఆయనకు షేక్ హ్యాండ్ కూడా ఇవ్వలేదు" అని తేల్చి చెప్పారు. జమ్ముకశ్మీర్‌లోని యువతకు ఉద్యోగాలు ఇస్తామన్న కేంద్ర ప్రభుత్వం..ఆ మాట నిలబెట్టుకోలేక పోయిందని విమర్శించారు. "మనకు 50 వేల ఉద్యోగాలు ఇస్తామన్నారు..? ఆ హామీ ఏమైంది" అని ప్రశ్నించారు. తరచూ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు ఫరూక్. త్వరలోనే ఎన్నికలు నిర్వహించాలని ఇటీవలే ఎన్నికల సంఘాన్ని కోరారు.

## మళ్లీ 23 చుట్టూ రాజకీయం

విజయవాడ, మార్చి 24,ఏపీలోని ఎమ్మెల్సీ కోటా ఎమ్మెల్యే ఎన్నికల్లో సంచలనం చోటుచేసుకుంది. టీడీపీ నుంచి బరిలోకి దిగిన అభ్యర్థిని పంచుమర్తి అనురాధ విజయం సాధించింది. ఆమె గెలవాలంటే.. వాస్తవానికి 22 ఓట్లు కావాలి. కానీ ఆమెకు 23 ఓట్లు పోలయ్యాయి. గెలిచేందుకు తగినంత మెజార్టీ లేకపోయినప్పటికీ టీడీపీ బరిలోకి దిగి.. అనూహ్య విజయం సాధించింది. టీడీపీ గత సార్వత్రిక ఎన్నికల్లో కేవలం 23 సీట్లు మాత్రమే గెలుచుకుంది. అందులో నుంచి నలుగురు ఎమ్మెల్యేలు కరణం బలరామకృష్ణమూర్తి, మద్దాళి గిరిధర్, వల్లభనేని వంశీ, వాసుపల్లి గణేష్‌కుమార్ .. అధికార వైసీపీకి మద్దతు పలికారు. దీంతో ఆ పార్టీ బలం 19కి పడిపోయింది. ఒకవేళ వైసీపీపై అసమ్మతి గళం వినిపిస్తున్న.. ఆనం రామనారాయణ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి.. టీడీపీకి ఓటు వేశారు అనుకున్నా.. టీడీపీ బలం 21కి చేరేది. కానీ అనురాధకు 23 ఓట్లు పోలయ్యాయి. దీన్ని బట్టి.. వైసీపీ నుంచి క్రాస్ ఓటింగ్ జరిగినట్లు పక్కాగా స్పష్టమవుతుంది. 2014 ఎన్నికల్లో టీడీపీ 102 సీట్లు సాధించి అధికార పీఠం దక్కించుకుంది.. వైసీపీ 67 సీట్లతో ప్రతిపక్షానికి పరిమితమైంది. ఆ తర్వాత కాలంలో.. దాదాపు 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలు అప్పటి అధికార టీడీపీలోకి జంప్ అయ్యారు. కట్ చేస్తే.. 2019 ఎన్నికల్లో వైసీపీ 151 సీట్లతో విజయకేతనం ఎగరవేసింది. టీడీపీ కేవలం 23 సీట్లకు పరిమితమైంది. తమ పార్టీ నుంచి లాక్కున్నఎమ్మెల్యేల సంఖ్యే ప్రస్తుతం టీడీపీకి మిగిలిందని వైసీపీ ఎమ్మెల్యేలు చంద్రబాబును ఎద్దేవా చేసేవారు. కట్ చేస్తే ఇది మూడవ నెల? 23వ? తారీఖు 2023వ సంవత్సరం(23-3-2023). ఇదే రోజున 23 ఓట్లతో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి అనురాధ విజయం సాధించారు. ఇదంతా చూస్తుంటే.. 23 సంఖ్యతో టీడీపీకి విడదీయరాని అనుబంధం ఉందని కామెంట్స్ పెడుతున్నారు నెటిజన్స్.

## కమలం ఒంటరి పోరుకు సంకేతాలు

కాకినాడ, మార్చి 24, ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఒంటరిగానే వెళ్లేందుకు దాదాపు సిద్ధమయింది. పార్టీ కేంద్ర నాయకత్వం నుంచి కూడా అదేరకమైన సంకేతాలు అందుతున్నాయి. జనసేన అధినేత పవన్ కల్యాణ్ తో సంబంధం లేకుండా పార్టీ కార్యక్రమాలు చూసుకోవాలని స్పష్టమైన మెసేజ్ హస్తిన నుంచి బెజవాడకు చేరినట్లు విశ్వసనీయ సమాచారం. జాతీయ పార్టీ ఒకరి కోసం వెంపర్లాడే పరిస్థితి లేదన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ఇటీవల మచిలీపట్నంలో జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ సభలో పవన్ చేసిన ప్రసంగాల క్లిప్పింగ్‌లను కూడా కేంద్ర నాయకత్వానికి పంపారు. దీంతో ఒకరితో పనిలేకుండా పార్టీ విజయం కోసం పని చేయాలని సూచించినట్లు రాష్ట్ర ముఖ్య నేతలకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. తనకు కేంద్ర నాయకులతో ఎలాంటి ఇబ్బందులు లేవని, రాష్ట్ర నేతలతో సమస్య అని పవన్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. చలో అమరావతి కార్యక్రమాన్ని ఇక్కడ వాయిదా వేయించింది కూడా ఇక్కడి నేతలే అన్నారు. తెలంగాణలో కలసి పోటీ చేయాలనుకున్నా ఆంధ్రోడివని కొందరు అంగీకరించలేదన్నారు. ఈ వ్యాఖ్యలను కేంద్ర నాయకత్వం కూడా సీరియస్ గా తీసుకున్నట్లుంది. పవన్ కల్యాణ్ తొలి నుంచి టీడీపీ, బీజేపీతో కలసి పోటీ చేయాలని భావిస్తున్నారు. ఆ దిశగా ఆయన ప్రయత్నాలు చేశాడు. కానీ బీజేపీతో కలసి పోటీ చేస్తే 2019 ఎన్నికల ఫలితాలు రిపీట్ అవుతాయని భావించి పవన్ వెనకడుగు వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పవన్ టీడీపీతో వెళ్లేందుకే నిర్ణయించుకున్నట్లు స్పష్టంగా అర్థమవుతుందని రాష్ట్ర నేతలు కేంద్ర నాయకత్వానికి వివరించినట్లు తెలిసింది. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పవన్ మద్దతును బీజేపీ నేతలు కోరినా అందుకు ఆయన సహకరించలేదు. ఈ ఎన్నికలు కాదు బద్వేలు, ఆత్మకూరు ఉప ఎన్నికల్లోనూ ఆయన తమకు సహకరించలేదన్నది బీజేపీ నేతలవాదన. కేవలం రాష్ట్ర ఎన్నికల సమయంలో కేంద్ర నాయకత్వం అండ కోసమే బీజేపీ మద్దతు కోరుకుంటున్నారని కూడా రాష్ట్ర నాయకత్వం అభిప్రాయ పడుతుంది. అందుకే కేంద్ర నాయకత్వం కూడా పవన్ పట్టించుకోకుండా ఎవరి పని వారు చేసుకోవాలని సూచించినట్లు తెలిసింది. ఒకరి బ్లాక్ మెయిల్‌కు, ఒకరి వ్యూహాలతో మనం భయపడాల్సిన పనిలేదని, సొంతంగా ఎదిగేందుకే ప్రయత్నాలు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి సూచించినట్లు తెలిసింది. ఇప్పుడు కాకపోతే.. మరొకసారి ఎప్పటికైనా ఏపీలో బీజేపీ జెండా ఎగురవేయగలమని, పొత్తుల గురించి ఆలోచించవద్దని సూచించినట్లు తెలిసింది. భీమవరంలో జరిగిన సమావేశంలోనే ఈ స్పష్టత వచ్చినా మరోసారి పొత్తులపై కూడా కేంద్ర నాయకత్వం నుంచి స్పష్టత వచ్చినట్లు తెలిసింది. తెలుగుదేశం పార్టీతో కలసి పోటీ చేసే అవకాశం లేనే లేదని కేంద్ర నాయకత్వం సుస్పష్టంగా చెప్పినట్లు సమాచారం. ఏమైనా కొద్దిగా మనసులో ఉన్నా వాటిని చెరిపేసి ముందుకు నడవండని రాష్ట్ర నాయకత్వానికి సూచించిందని చెబుతున్నారు. మూడు రోజుల క్రితం జరిగిన బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో మరోసారి దీనిపై నేతలకు స్పష్టత ఇచ్చినట్లు తెలిసింది. పవన్ ఎటూ తమతో కలసి రాడని బీజేపీ నేతలకు అర్థమయి పోయింది. బతిమాలనుకుని ప్రయోజనం లేదని, ఎన్నికల సమయానికి కలసి వస్తే చూద్దామని, లేకుంటే లేదని కూడా నేతలు అభిప్రాయపడినట్లు తెలిసింది. పవన్ కల్యాణ్ పొత్తులు కాదనుకుని వెళ్లిపోయినా పెద్దగా ఇబ్బంది ఉండదని, ఒంటరిగానైనా పోరాడేందుకు సిద్ధపడాలని సెంట్రల్ నుంచి సిగ్నల్స్ వచ్చినట్లు తెలిసింది.

## మాకు 23 కలిసోచ్చింది

### మాజీ మంత్రి గంటా శ్రీనివాస్

విశాఖపట్నం దేవుడు చక్కగా స్క్రిప్ట్ ఇచ్చాడుని,23 సంఖ్య తమకు కలిసివచ్చేటట్లు చేశా డని మాజీ మంత్రి, విశాఖ ఉత్తర ఎమ్మె ల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు.ఏ డు ఎమ్మెల్సీ లో ఒకటి టీడీపీ అనూ హ్యంగా గెలవడం ఆ గెలుపులో వైసీపీ కి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు సహక రించడంతో టీడీపీకి ఆదరణ చెక్కు చెదరలేదన్నది స్పష్టమవుతుం దన్నా రు.హిందూపురం నుంచి ఇచ్చాపురం వరకూ ఒకటే గాలి వీచిందన్నారు. ఎమ్మెల్సీ గెలవడంతో విశాఖ టీడీపీ కార్యాలయంలో గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించా రు.ఈ సందర్భంగా గంటా మాట్లాడు తూ ఎమ్మెల్సీ ఎన్నికలు సెమీఫైనల్స్ అని వైసిపి వారే అన్నా రని, సెమీస్ లో ఓడిపోతే ఇక ఫైనల్స్ లో స్థానం ఉండ దన్న విషయం ఇప్పటికైనా తెలు సుకో వాలన్నారు. వైసిపి కి ఇది తీవ్రమైన ప్రతికూల ఫలితాల న్నారు. జగన్కి ఇచ్చిన ఒక్క ఛాన్స్ అయ్యి పోయింద ని స్పష్టమైన తీర్పుకు ఇది సంకేతమ న్నారు.సీనియర్ మిని స్టర్లను ఉపయో గించి మాక్ పోలింగ్ నిర్వహించినా ఫలితం లేకపోయింద న్నారు..

## డా.వైఎస్సార్ విత్తన పరిశోధన, శిక్షణ కేంద్రానికి శంకుస్థాపన

గన్నవరం గన్నవరంలోని ఏపీఎస్ఎస్డిసి ఆవరణలో రాష్ట్ర మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఆర్కే.రోజా, రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ నాగిరెడ్డి, సంస్థ ఛైర్ పర్సన్ హేమసుశ్మిత శంకుస్థాపన చేసారు. మంత్రులు మాట్లాడుతూ వ్యవసాయశాఖలో నూతన అధ్యయనానికి ఈ కేంద్రం ఎంతో దోహద పడుతుందని అన్నారు. పనిలో పనిగా తెదేపా అధినేత చంద్రబాబుపై ఘాటు విమర్శలు చేసారు. అసెంబ్లీకి రానన్న చంద్రబాబు ఎందుకు వచ్చారని మంత్రి రోజా ప్రశ్నించారు. అధికారంలో ఉండగా 23 ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన చంద్రబాబు 23 సీట్లతో ప్రతిపక్షంలో కూర్చొబెట్టారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇద్దరు ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారు. 2024 సాధారణ ఎన్నికల్లో ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే తెదేపా కు మిగులుతారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీమోహన్, వైకాపా ప్రజాప్రతినిధులు పాల్గోన్నారు.

## ఆంధ్రాకు వచ్చిన తల్లిపులి

కర్నూలు, మార్చి 24, ఇటీవలే నాలుగు పులి పిల్లలకు జన్మనిచ్చిన ఓ పులి ఏపీ నుంచి తెలంగాణలోకి వచ్చినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం పెద్ద గుమ్మడాపురం ప్రాంతంలో చెట్లపొదల్లో నాలుగు ఆడపులి పిలల్లకు జన్మనిచ్చింది. అయితే 6వ తేదీన పిల్లలను వదిలి కృష్ణా నది దాటి తెలంగాణలోని కొల్లాపూర్ సమీపంలో ఉన్న నల్లమల అడవులకు చేరిందని స్థానిక అటవీ శాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. అయితే ఈ క్రమంలోనే కొల్లాపూర్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని సులాలకుంట అటవీ ప్రాంతంలో.. అటవీ శాఖ అధికారులు అమర్చిన సీసీటీవీ కెమెరాలో ఓ ఆడ పులి ట్రాప్ అయినట్లు రెండ్రోజుల క్రితం గుర్తించారు. అయితే ఆంధ్రా నుంచి వచ్చిన పులేనా లేక మరో పులా అన్న విషయమై అధికారులు ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ఈ క్రమంలోనే ఈ పులిని గుర్తించే పనిలో పడ్డారు అటవీ శాఖ అధికారులు. ఈనెల 21వ తేదీన అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ క్షితజ దంపతులు సంగమేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. ఏపీలోని ఆత్మకూరు అటవీ డివిజన్ అధికారులు అక్కడకు చేరుకొని ఆమెను కలిశారు. అక్కడి నుంచి పిల్లలకు జన్మనిచ్చిన తల్లి పులి నల్లమలకు చేరినట్లు సమాచారం అందించారు. దీంతో ఆమె కొల్లాపూర్ రేంజ్ అధికారులను అప్రమత్తం చేశారు. అధికారులు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రెండ్రోజుల క్రితం సులాలుకుంట ప్రాంతంలో ఆడ పులి సంచరించిన దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తం అయ్యారు. ఈ విషయంపై ఇరు ప్రాంతాల అటవీ శాఖ అధికారులు ఇంకా స్పష్టతను ఇవ్వలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆత్మకూరులో తల్లి నుండి వేరు అయిన నాలుగు పులి పిల్లలు లభ్యమైన విషయం తెలిసిందే. ఇప్పటికే పెద్దపులి సంచారంతో భయపడ్డ గ్రామస్థులు.. పులి పిల్లలను చూసి తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించి నాలుగు పులి పిల్లలను రక్షించారు. పులి పిల్లల కోసం పులి వస్తుందేమో అని ఫారెస్టు అధికారులు అనేక విధాలుగా ప్రయత్నం చేసినా పెద్దపులి జాడ ఏమాత్రం కనిపించలేదు. అయితే ఈ పులి కూనల సంరక్షణార్థం తిరుపతి ఎస్వీ జూ పార్కుకు అప్పగించారు.జూపార్కులో ఏసీఎఫ్ నాగభూషణం మీడియాతో మాట్లాడుతూ.. నంద్యాల జిల్లా ఆత్మకూరు ప్రాజెక్టు పరిధిలో 50 రోజుల వయసు కలిగిన పులి పిల్లలను అక్కడి జూ అధికారులు మహమ్మద్ సయ్యద్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుభాష్, ఎస్కార్ట్ సిబ్బందితో కలిసి అప్పగించారని తెలిపారు. వెటర్నరీ డాక్టర్ల పర్యవేక్షణలో వాటి ఆరోగ్య పరిస్థితిని పరీక్షించినట్లు వివరించారు. తల్లి నుండి విడిపోయిన తర్వాత ఫీడింగ్ లేక పోవడంతో కొంత బలహీనంగా ఉన్నాయన్నారు. వైద్యుల పర్యవేక్షణలో బలవర్ధకమైన ఫీడింగ్ అందజేసి, మంచి వాతావరణంలో పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటే, ఏసీలో వాటిని ఉంచి రక్షిస్తామని అన్నారు. వెటర్నరీ వైద్యులతో తరచుగా తనిఖీ చేయిస్తుంటామన్నారు.

## అప్పన్న స్వామి సన్నిధిలో ఘనంగా స్వర్ణపుష్పార్చన

విశాఖపట్నం విశాఖ వరాహలక్ష్మీనృసింహ స్వామి వారి దేవస్థానం సింహాచలం స్వామి వారికి 108 బంగారు సంపెంగలతో స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహిం చారు.సింహాచల పుణ్య క్షేత్రములో దేవస్థాన వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా పలు ఆర్జిత సేవలు వైభ వంగా నిర్వహించారు.

అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్దంగా నిర్వహించారు. శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపములో వేదికపై అధీష్టింపజేసి వేద మంత్రాలు నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి స్వర్ణపుష్పార్చన,సేవ వైభవంగా నిర్వ హించారు.భక్తులు శ్రీ స్వామి వారి ఆర్జిత సేవలలో పాల్గొని తరించారు

## గ్యాస్ ట్యాంకర్ కు ప్రమాదం?డ్రైవర్ కు గాయాలు

విశాఖపట్నం విశాఖపట్నం జిల్లా కంచరపాలెం నేషనల్ హైవే లో శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. మూడు గంటల ప్రాంతంలో ముందు వెళుతున్న టాటా ఏసీ మినీ వ్యాన్ సడన్ గా ఆగిపోయింది. దాంతో వెనుక వస్తున్న ఇండియన్ ఆయిల్ ట్యాంకర్ ఢీకొంది. తరువాత డివైడర్‌ను తాకి పక్కన వున్న చెట్లలోకి దూసుకు వెళ్లింది. ఘటనలో ట్యాంకర్ డ్రైవర్ కు గాయాలు అయ్యాయి. ఇండియన్ ఆయిల్ కి సంబంధించిన గ్యాస్ ఫుల్ ట్యాంక్ లో ఉండడంతో హెచ్పీసీఎల్ సిబ్బంది హుటా హుటిన అక్కడికి చేరుకున్నారు. గ్యాస్ లీక్ అవకుండా జాగ్రత్తలు తీసుకొని లారీని సురక్షితంగా తరలించారు.

## చట్టసభలో బీసీలకు యాభై శాతం రిజర్వేషన్ కల్పించాలి బీసీ సంఘం డిమాండ్

విశాఖపట్నం చట్టసభలో బీసీలకు యాభై శాతం రిజర్వేష న్ కల్పించాలని జాతీ య బీసీ సంక్షేమ సంఘం స్టేట్ కన్వినర్ బోను దుర్గా నరేష్ యాదవ్ డిమాండ్ చేశారు. హలో బీసీ ....చలో రాజమం డ్రి....అనే నినాదంతో బీసీ గర్జన సభ ఈ నెల 25 న నిర్వహిస్తున్నట్లు తెలి పారు. పార్లమెంట్లో బీసీ బిల్లు ప్రవేశ పెట్టాలని,యాభై శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశా రు. జనగణనలో కులగణన జరగాలని అప్పుడే దేశంలో బీసీ ల సంఖ్యాబలం స్రష్టం అవుతుందని అన్నారు. కేంద్రం లో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్లో బీసీ మహిళ బిల్లు ప్రవేశ పెట్టాలని ఆయన కోరారు. ఉద్యోగస్తు లకు ప్రమోషన్లు రిజర్వేషన్లు కల్పించా లని విజ్ఞప్తి చేశారు. హలో బిసి చలో రాజమండ్రి కార్యక్రమంలో బీసీ సోదర సోదరీమ ణులు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయ వంతం చేయాలని బిసిలకు పిలుపునిచ్చారు

## ఈ సారి రెండు సీట్లు కూడా రావు

తిరుపతి, మార్చి 24,ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరాభవంపై మంత్రి రోజా ఘాటుగా స్పందించారు. 2014లో 23 మందిని కొన్నందుకే 2019లో 23 వచ్చాయని, ఇప్పుడు ఇద్దర్ని కొన్నందుకు వచ్చే ఎన్నికల్లో ఆ రెండు కూడా రావని రోజా జోస్యం చెప్పారు. జగన్‌ను ఎవరు వ్యతిరేకించినా వారికే నష్టమని మంత్రి రోజా అన్నారు. జగన్‌కు సొంత అజెండా, జెండా ఉందని ఆమె పేర్కొన్నారు. అధికారంలో ఉండగా 23మందిని కొన్నారు కాబట్టే చంద్రబాబు 23సీట్లకు పరిమితం అయ్యారని అన్నారు. ఇప్పుడు ఇద్దరిని కొన్నారు కాబట్టి రాబోయే ఎన్నికల్లో ఆ రెండు స్థానాలు కూడా దక్కవని రోజా కామెంట్ చేశారు. చంద్రబాబు చేసే నీచ రాజకీయాలకు భవిష్యత్‌లో ఆయనకే అవి తిరుగబడతాయన్నారు. కొడుకును ముఖ్యమంత్రి చేయాలనే ప్రయత్నం ఫలించదని, వచ్చే ఎన్నికల్లో ప్రజంతా ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డిని గెలిపించేందుకు ఫిక్స్ అయ్యారని అన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌పై మంత్రి కాకాణి గోవర్దన్ రెడ్డి స్పందించారు. ఒకరిద్దరు ఓటు వేయకుండా మోసం చేసినంత మాత్రాన జగన్‌కు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి వచ్చిన నష్టం లేదని మంత్రి కాకాణి అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌కి వ్యతిరేక ఓటు వేయటం పార్టీ అంతర్గత సమస్యని ఆయన వ్యాఖ్యానించారు. వ్యతిరేక ఓటు వేసిన వారిపై చర్యలుంటాయని తెలిపారు. క్రాస్ ఓటింగ్‌పై అంతర్గత సమావేశాల్లో విశ్లేషణ చేసి ముందుకు వెళ్తామని అన్నారు. సంఖ్యా బలం ప్రకారం 7 స్థానాల్లో పోటీ చేశామని వెల్లడించారు. చంద్రబాబు చేసుకునే చివరి విజయోత్సవాలు ఇవేనని మంత్రి కాకాణి వ్యాఖ్యానించారు. 2024 చంద్రబాబు చివరి ఎన్నికలని, ప్రజల్లో సార్వత్రిక ఎన్నికలు జరిగినపుడు టీడీపీ విషయం బయటపడుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత, రెండో ప్రాధాన్యత ఉండదని కేవలం ప్రజలకు ఒక ఓటు మాత్రమే ఉంటుందని అన్నారు. ఈ ఫలితాలపై ఆలోచన చేయాల్సిన అవసరం లేదన్నారు. 2024లో వైసీపీ ఘన విజయం సాధించి జగన్ మళ్ళీ సీఎం అవుతారని స్పష్టం చేశారు. జరిగిన దానికి చంద్రబాబే సంజాయిషీ ఇవ్వాలని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. పోటీలో దిగాం కాబట్టి ప్రయత్నం చేశామని, పిలిచి మాట్లాడాం కూడా అని చెప్పారు. తమ వైపు నుంచి చేయాల్సిన ప్రయత్నాలు అన్నీ చేశామని ఆయన వ్యాఖ్యానించారు. అక్కడ డబ్బు పని చేసినప్పుడు దాని మీద సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం లేదని, చంద్రబాబే సంజాయిషీ ఇవ్వాలని సజ్జల అన్నారు. ఏ నమ్మకంతో ఆ ఇద్దరు తెలుగు దేశానికి ఓటు వేశారో అందరికి తెలుసని అందుకు బలమైన కారణం డబ్బేనని సజ్జల వ్యాఖ్యాని ంచారు. చంద్రబాబునా యుడికు శాశ్వతంగా 23 స్థానాలు రావని ఆయనే ఒప్పుకుంటున్నారని 23 వారికి అచ్చొచ్చిన ఫిగర్ అయితే ఆయన్ని కంగ్రాట్స్ చేస్తున్నామని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు జగన్ చేపట్టిన సంస్కరణలు అందుకుంటున్నారని, కాబట్టి 175కు 175 గెలుస్తాం అన్న నమ్మకంతో ఉన్నామన్నారు. దానికి దీనికి అసలు సంబంధం లేదని ఆయన అన్నారు. చంద్రబాబు 175 స్థానాల్లో ఎందుకు పోటీ చేయలేకున్నారో స్పష్టం చేయాలని సజ్జల డిమాండ్ చేశారు. నిజంగా చంద్రబాబు ఎమ్మె ల్సీ ఎన్నికలను చూసి బలపడ్డా మనుకుంటే 175కు ఎందుకు పోటీ చేయలేకపోతున్నారో స్పష్టం చేయాలన్నారు. ఏ పార్టీ అయినా వారి విధానాలు వారి మేనిఫెస్టోలో స్పష్టంగా చెబుతారని అడ్డదారులు తొక్కి ఓట్లు వేయమనడం కరెక్టా అని సజ్జల అన్నారు.

# ప్రశాంత వాతావరణం పండుగలు జరుపుకోవాలి

......నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ రఘువీర్ రెడ్డి



నంద్యాల ప్రతినిధి :-నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ కె. రఘువీర్ రెడ్డి గారి అధ్యక్షతన నంద్యాల జిల్లాలోని తన క్యాంప్ కార్యాలయం నందు రంజాన్, శ్రీరామనవమి పండుగ ల సందర్భంగా పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా నంద్యాల పట్టణంలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో గల ముస్లిం మరియు హిందువుల మత పెద్దలతో కలిసి పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా రంజాన్ మరియు శ్రీరామనవమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పండుగలను అందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని దానికి పోలీస్ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేశారు. కొంతమంది ముస్లిం మత పెద్దలు రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసం ముగించడానికి రాత్రి వేళలో హోటల్స్ మూసివేసే సమయం 11 గంటల వరకు మరియు ఉదయం నాలుగు గంటలకు తెరుచు విధంగా అనుమతి ఇవ్వాలనే విజ్ఞప్తి మేరకు జిల్లా ఎస్పీ గారు సానుకూలంగా స్పందించి పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు అనంతరం టౌన్ లో పికెట్స్ మరియు గట్టి బందోబస్తు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలని మరియు ఈద్గాల వద్ద పార్కింగ్ స్థలాలు కూడా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.అందరు చట్టాలను గౌరవించాలని, వాటిని ఎవ్వరు అతిక్రమించరాదని, కులమతాలకు అతీతంగా అందరూ సోదర భావంతో కలిసిమెలిసి ఐకమత్యంతో మెలిగి పండుగల జరుపుకోవాలని సూచించారు . ఏవైనా వదంతులను సోషల్ మీడియా నందు ఏదేని వర్గమును రెచ్చగొట్టే విధంగా ఏదేని తప్పుడు సమాచారంను వ్యాప్తి చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఏదైనా వదంతులు వచ్చిన ఎవరు నమ్మవద్దని తెలిపారు. ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రజాశాంతికి భంగం కలిగించే అల్లరిమూకలపై నిఘా ఉంచామని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు ఈ సమావేశానికి హాజరైన హిందూ ముస్లిం మత పెద్దలు శాంతిభద్రతల విషయంలో పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని జిల్లా ఎస్పీ గారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు అడిషనల్ ఎస్పీ ఆర్. రమణ , నంద్యాల టౌన్ డిఎస్పి సి .మహేశ్వర్ రెడ్డి ,నంద్యాల టూ టౌన్ సిఐ ప్రభాకర్ రెడ్డి ,నంద్యాల వన్ టౌన్ సిఐ కృష్ణయ్య , స్పెషల్ బ్రాంచ్ సిఐ దస్తగిరి బాబు ,నంద్యాల తాలూకా రూరల్ సిఐ రవీంద్ర ,నంద్యాల 3 టౌన్ ఎస్సై నగీన మరియు పీస్ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

# సచివాలయాల ద్వారా సర్వే వేగవంతం చేయండి



--ఎ.పి. సేవాసర్వీసులలో పెండింగ్ లేకుండా చూడాలి

--లేబర్ మొబలైజేషన్ లక్ష్యాన్ని సాధించండి

నంద్యాల ప్రతినిధి :-గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వే వేగవంతం చేసి ప్రభుత్వం నిర్దేశించిన సర్వీసులను నిర్ణీత కాలవ్యవధిలోగా అందించేందుకు ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో సచివాలయాల సర్వీసులు, ఉపాధి హామీ లేబర్ మొబలైజేషన్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ నిశాంతి. టి.,జిల్లా పరిషత్ డెప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డ్వామా పిడి రామచంద్రారెడ్డి, డిఎల్డిఓ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం లేకుండా పూర్తిస్థాయి దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ప్రధానంగా ఐదు సంవత్సరాలలోపు బరువు తక్కువగా ఉన్న పిల్లలు, 6 నుండి 19 సంవత్సరాల లోపు రక్త రక్తహీనత గల కౌమారదశ బాలికలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు తదితర వివరాల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పుట్టిన తేదీ సర్టిఫికెట్లు గడువులోపే జారీ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ, పుట్టిన తేదీ సర్టిఫికెట్లతో ఆధార్ అనుసంధానం, ఆయుష్మాన్ భారత్ సర్వే, హెల్త్ కార్డు సర్వే తదితర అంశాల్లో వచ్చే గురువారానికి పురోగతి కనిపించాలన్నారు. ఎ.పి. సేవాసర్వీసులలో సాంకేతిక సమస్యలుంటే క్లియర్ చేసుకొని పెండింగ్ లేకుండా చూడాలన్నారు. పాణ్యం, బేతంచెర్ల తదితర మండలాల్లో సచివాలయాల సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్ తక్కువగా ఉందని, ఇన్ టైమ్ తో సమానంగా ఔట్ టైమ్ కూడా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే స్పందన కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది అందరూ హాజరు కావాలన్నారు.గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన పనుల్లో 574 ప్రగతిలో వున్న పనులను పూర్తి చేయడంతో పాటు ఇంకా మొదలు కాని పనులు వెంటనే ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్ లు, ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. బయోమెట్రిక్ అటెండెన్స్ లో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు సీరియస్ గా ఉండాలన్నారు. సచివాలయ సిబ్బంది వారం రోజులు మించి మెడికల్ లీవులో వెళ్తే మెడికల్ బోర్డుకు రిఫర్ చేయాలని కలెక్టర్ ఆశించారు. ఎపీ సేవా సర్వీసులలో జిల్లా దిగువ నుంచి 5వ స్థానంలో ఉందని సర్వీసులలో పురోగతి తీసుకురావాలన్నారు. అలాగే ఈనెల 27, 28, 29 తేదీలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆధార అప్డేషన్ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఉపాధి హామీ కింద నిర్దేశించిన లక్ష్యాన్ని మార్చినెలాఖరులోగా పూర్తి చేయాలని సంబంధిత ఏపిడిలను, ఏపిఎం లను కలెక్టర్ ఆదేశించారు. డోన్, కోవెలకుంట్ల, నంద్యాల క్లస్టర్ లలో లేబర్ మొబలైజేషన్ తక్కువగా వుందని... ఈ నెలాఖరులోగా స్టేట్ యావరేజ్ కు తీసుకురావాలని డ్వామా పిడిని ఆదేశించారు.

# సీపీఐ పై ఫేస్ బుక్ లో తప్పుడు ప్రచారం

- పోలీసులకు సిపిఐ పిర్యాదు

విశాఖపట్నం ధర్మ ధ్వజం హిందూ చైతన్య వేదిక అనే పేరుతో నిర్వహిస్తున్న పేస్ బుక్ పేజీలో సిపిఐపై తీవ్రమైన అసత్య ప్రచారం జరుగుతోంది.నాలుగు రోజు లు క్రితం ఆ పేస్ బుక్ ఖాతాలో సిపిఐ ప్రపంచ ఉగ్రవాద సంస్థల జాబితాలో ఉన్న రాజకీయ పార్టీ అని పేర్కొంటూ ప్రచారం చేశారు.ఇందుకు ఇన్స్టిట్యూ ట్ ఫర్ ఎకనామిక్స్ అండ్ పీస్ సంస్థ విడుదల చేసిన గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ 2023 నివేదికను అదారంగా చూపారు.ఐతే, 95 పేజీలతో ఉన్న ఆ నివేదిక ఒరిజినల్ కాఫీలో 14 వ పేజీ లోని లిస్టులో సిపిఐ అనే పేరు ఎక్కడా లేదు.ఘన చరిత్ర కలిగిన బాధ్యతా యుత రాజకీయ పార్టీపై ఉద్దేశ పూర్వ కముగా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన ఆ పేస్ బుక్ పేజీ నిర్వా హకులపై కఠిన చర్యలు తీసుకోవాలని విశాఖ నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో పిర్యాదు చేశారు.

# విద్యుత్ అధికారులను వెనక్కి సాగనంపిన కొర్ర పోలూరు గ్రామ ప్రజలు

. రైతు లకు.సిపిఐ సంపూర్ణ మద్దతు




నంద్యాల ప్రతినిధి :-. గడివేముల మండలంలోని కొర్రపోలూరు గ్రామంలో పేదల సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములలో గ్రామ ప్రజలు. రైతులు వ్యతిరేకిస్తున్న విద్యుత్ అధికారులు బలవంతంగా ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వే చేయడం దుర్మార్గమైన చర్య అని సర్వే పనులను వెంటనే నిలిపివేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి. ఎస్. బాబా ఫకృద్దీన్. ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. కొర్రపోలూరు గ్రామంలో దశాబ్దాలుగా పేద రైతులు తమ జీవనాధారణ కోసం ప్రభుత్వ భూములలో సాగు చేస్తు జీవనం సాగిస్తున్నారు . విద్యుత్ ప్రాజెక్టు నిర్మించేందుకు ప్రభుత్వ అధికారులు చర్యలు చేపట్టడం అన్యాయం అని అన్నారు. పేదల సాగు చేసుకుంటున్నా భూములకు కలెక్టర్ గారు పట్టాలిచ్చేంత వరకు రైతులకు అండగా సిపిఐ జిల్లా సమితి.ప్రజా సంఘాలు.అండగా. తోడుగా నిలబడి ఆందోళన నిర్మించేందుకు సన్నద్ధమవుతామని. విద్యుత్ అధికారులు తమ వైఖరి మార్చుకొని రైతులను ఇబ్బంది లకు గురి చేయకుండా ఉండాలని. లేనిపక్షంలో ఉద్యమాల మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# సాంబవరంలో ఘనంగా ఎడ్ల పందాలను ప్రారంభించిన..-ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జూపల్లి రాకేష్ రెడ్డి...


నంద్యాల ప్రతినిధి:-నంద్యాల జిల్లా నంద్యాల మండల పరిధిలో ఉగాది పండుగ శుభ సందర్భంగా సాంబవరం గ్రామంలో అత్యంత వైభేతంగా ఎడ్ల పందాలను ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జూపల్లి రాకేష్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి, ఎడ్ల బండలాగుడును స్టార్ట్ చేసి ఘనంగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జూపల్లి ప్రభాకర్ రెడ్డి, మద్దిలేటి రెడ్డి, శేఖర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, ఆదినారాయణ సుంకులయ్య, జింకల కొండన్న శ్రీను మరియు తదితరులు పాల్గొన్నారు.



# అది నా ఏరియా కాదు.. వచ్చినా వదిలేస్తా!



సెలబ్రిటీలపై సోషల్ మీడియాలో నిత్యం ఏదోరకమైన ప్రచారం సాగుతుంటుంది. అందులోనూ హీరోయిన్ల వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన నెట్టింట చక్కెర్లు కొడుతుంటాయి. అవి వృత్తిగతమైనవి అయినవి కావొచ్చు. వ్యక్తిగతంగానైనా కావొచ్చు. వీటిని ఖండించే వాళ్లు కొందరైతే! ఎలాంటి ఖండన చేయనివారు మరికొంత మంది ఉంటారు. తాజాగా మలయాళం బ్యూటీ సంయుక్తా మీనన్ రెండవ కేటగిరికీ చెందిన నటిగా తెలుస్తోంది.సోషల్ మీడియాలో మీపై జరిగే ప్రచారాల్ని ఎలా స్వీకరిస్తారంటే? ఆసక్తికర సంగతులు తెలిపింది. 'అది నా ఏరియా కాదు. నేను సినిమాల్లో పనిచేయడానికి వచ్చాను. నా దృష్టంతా వాటిపైనే ఉంటుంది.అనసరంగా సాగే ప్రచారాల్ని పట్టించుకోను. అవతలి వాళ్లు కావాలని పనిగట్టుకుని చేస్తున్నారా? వాస్తవాలు రాస్తున్నారా? అన్నది కూడా పట్టించుకోను. నా మైండ్ సెట్ కి అది అనవసరం అనిపిస్తుంది.ఎప్పుడు ఇలాగే ఆలోచిస్తాను. అవతలి వారి ఉద్దేశం ఏంటో నాకు తెలియదు. వాళ్ల మనోభావాల్ని గౌరవిస్తాను. అది నెగిటివ్ అయినా..పాజిటివ్ అయినా ఒకేలా ఆలోచిస్తా' అని తెలిపింది. ఈ బ్యూటీ 'భీమ్లా నాయక్' సినిమాతో హీరోయిన్ గా పరిచయమైన సంగతి తెలిసిందే. అటుపై 'బింబిసార'తో మరో సక్సెస్ ని ఖాతాలో వేసుకుంది. ఇటీవలే విడుదలైన 'సార్' సినిమాలోనూ ధనుష్ కి జోడీగానూ నటించింది.ఈ సినిమా తెలుగు..తమిళ్ లో చక్కని విజయాన్ని సాధించింది. వరుసగా మూడు విజయాలతో అమ్మడు లక్కీ హీరోయిన్ గా మారిపోయింది. ఈ నేపథ్యంలో కెరీర్ పై మరింత శ్రద్ధగా ముందుకు సాగుతుంది. హైదరాబాద్ లోనే తిష్ట వేసి స్టార్ హీరోయిన్ల జాబితాలో చేరే చర్యలు చేపట్టింది. మాలీవుడ్ లో అవకాశాలు వస్తున్నా పరిమితంగానే సంతకాలు చేస్తుంది.తెలుగులో స్టార్ హీరోయిన్లగా కొనసాగిన భామలంతా హిందీకి టర్న్ అవ్వడంతో ఇదే అవకాశంగా భావించి ముందుకు సాగుతుంది. దర్శకులతో తనకున్న పరిచయాల్ని వినియోగించుకుని అవకాశాలు చేజిక్కించుకునే ప్రణాళికతో ముందుకు కదులుతుంది. మరి అమ్మడి ప్రయత్నాలు ఎంత వరకూ సఫలమవుతాయో చూడాలి.




# మెగాస్టార్ ఫోకస్ ఆ బోల్డ్ డైరెక్టర్ పై పడిందా?

అర్జున్ రెడ్డి సినిమాతో టాలీవుడ్ లోకి దర్శకుడుగా ఎంట్రీ ఇచ్చి సూపర్ సక్సెస్ కొట్టిన టాలెంటెడ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా. ఈ సినిమా తర్వాత చాలా గ్యాప్ తీసుకున్న సందీప్ రెడ్డి బాలీవుడ్ లోకి అడుగుపెట్టి అదే మూవీని కబీర్ సింగ్ గారి మేక్ చేసి బ్లాక్ బస్టర్ హిట్ కొట్టాడు. తర్వాత బాలీవుడ్ లోనే రణబీర్ కపూర్ కి కథ చెప్పి ఓకే చేయించుకున్నాడు. ఏకంగా బడ నిర్మాణ సంస్థ అయిన టి సిరీస్ లో యానిమల్ సినిమాని ప్రస్తుతం తెరకెక్కిస్తున్నాడు.ఈ మూవీ షూటింగ్ కూడా చివరిదశకు వచ్చేస్తుంది. ఆగస్టులో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. పాన్ ఇండియా లెవెల్ లో యానిమల్ సినిమాని రిలీజ్ చేయబోతూ ఉండటం విశేషం. సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ రష్మిక మందన ఈ సినిమాలో హీరోయిన్ గా నటిస్తుంది. దీని తర్వాత సందీప్ రెడ్డి వంగా ఏకంగా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా స్పిరిట్ అనే సినిమాని చేయడానికి రెడీ అవుతున్నారు. ఆ సినిమాని కూడా టి సిరీస్ లోనే చేయబోతూ ఉండటం విశేషం. ఇక ప్రభాస్ తర్వాత అల్లు అర్జున్ తో మరో సినిమాని సందీప్ రెడ్డి కన్ఫామ్ చేసుకున్నారు. ఇవన్నీ కూడా పాన్ ఇండియా లెవెల్ లో తెరకెక్కబోయే సినిమాలే కావడం విశేషం. అర్జున్ రెడ్డి సినిమా సందీప్ రెడ్డి ఇమేజ్ ని అమాంతం పెంచేసింది అని చెప్పాలి.ఇది ఇలా ఉంటే ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవిని కూడా తన డైరెక్షన్ లైన్ అప్ లో చేర్చుకోవడానికి సందీప్ రెడ్డి రెడీ అవుతున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మెగాస్టార్ చిరంజీవిని కలిసి కథ చెప్పబోతున్నట్లుగా క్లారిటీ ఇచ్చారు. తన అభిమాన హీరో చిరంజీవికి కథ చెప్పి ఒప్పిస్తానని నమ్మకంతో ఉన్నట్లుగా చెప్పుకొచ్చారు.ఇక అర్జున్ రెడ్డి సినిమా డైరెక్షన్ విషయంలో చిరంజీవి కూడా సందీప్ రెడ్డిపై ప్రశంసలు కురిపించారు. మెగాస్టార్ చిరంజీవి తనని తాను కొత్తగా ఎలివేట్ చేసుకునే క్రమంలో పాన్ ఇండియా కథల కోసం కూడా చూస్తున్నారు. ఒకవేళ సందీప్ రెడ్డి మెగాస్టార్ చిరంజీవికి కథ చెప్పి ఓకే చేయించుకున్నట్లయితే కచ్చితంగా అది సెన్సేషన్ అవుతుంది.ఇప్పటికే ఈ దర్శకుడి జాబితాలో ప్రభాస్ అల్లు అర్జున్ చేరిపోగా కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ కూడా ఉన్నట్లుగా సమాచారం. రీసెంట్ గా అతనికి కథ చెప్పి ఓకే చేయించుకున్న ట్లుగా టాక్ వినిపిస్తోంది. ఇప్పుడు మెగస్టార్ తో సినిమా చేయడానికి తన దగ్గర మంచి స్టోరీ లైన్ ఉందని సందీప్ రెడ్డి వంగ ఇంటర్వ్యూలో పేర్కొనడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# ఓటమి భయం.. అందుకే రానంటున్నారు! అంత సీన్ లేదులే గానీ!




టీమిండియాను ఉద్దేశించి పాకిస్తాన్ మాజీ క్రికెటర్ ఇమ్రాన్ నాజిర్ చేసిన వ్యాఖ్యలపై అభిమానులు మండిపడుతున్నారు.ఇష్టారీతిన మాట్లాడితే సహించేదిలేదని వార్నింగ్ ఇస్తున్నారు. ముందు పాక్ జట్టు పరిస్థితి ఎలా ఉందో చూసుకోవాలని, ఆత్మవిశ్వాసం ఉంటే పర్లేదని.. ఓవర్ కాన్ఫిడెన్స్ పనికిరాదని హితవు పలుకుతున్నారు.కాగా ఆసియా కప్-2023 నిర్వహణ హక్కులను పాకిస్తాన్ దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు, బీసీసీఐ కార్యదర్శి జై షా.. ఈ టోర్నీ ఆడేందుకు భారత జట్టు పాక్కు వెళ్లదని వ్యాఖ్యానించారు. దీంతో ఇరు బోర్డుల మధ్య ఈ అంశానికి సంబంధించి చర్చోపచర్చలు జరిగాయి.ఈ నేపథ్యంలో ఆసియా కప్ పాక్లో నిర్వహించేందుకు అంగీకరించినప్పటికీ..టీమిండియా- పాకిస్తాన్ మ్యాచ్లు మాత్రం తటస్థ వేదికపై నిర్వహించేందుకు ఏసీసీ నిర్ణయించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇమ్రాన్ నాజిర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. "భద్రతా కారణాలు అనేవి కేవలం ఓ సాకు మాత్రమే. ఆస్ట్రేలియా వంటి మేటి జట్లు కూడా పాకిస్తాన్కు వచ్చాయి.కానీ భారత జట్టు మాత్రం రావడానికి సాకులు వెదుకుతోంది. పాకిస్తాన్ గడ్డపై ఓడిపోతామనే భయంతోనే వాళ్లు ఇక్కడికి రావడం లేదు. ఇక్కడికి వచ్చి క్రికెట్ ఆడండి. అప్పుడేగా అన్నీ తెలుస్తాయి. ఇండియా-పాకిస్తాన్ మ్యాచ్ అంటే క్రికెట్ ప్రేమికులకు ఆసక్తి. కానీ టీమిండియాకు ఓటమిని తట్టుకునే శక్తి ఉండదు.అందుకే ఇలా చేస్తున్నారు" అని నాదిర్ అలీ పాడ్కాస్ట్ షోలో ఇమ్రాన్ వ్యాఖ్యానించాడు. దీంతో టీమిండియా ఫ్యాన్స్ ఇమ్రాన్పై నిప్పులు చెరుగుతున్నారు. "అక్కడ పరిస్థితులు ఎలా ఉంటాయో అందరికీ తెలుసు. గతంలో ఇంగ్లండ్, న్యూజిలాండ్ అప్పటికప్పుడు సిరీస్లు రద్దు చేసుకున్న విషయం గుర్తులేదా?టీమిండియా వంటి పటిష్ట జట్టు గురించి ఇలాంటి అవాకులు చెవాకులు పేలేముందు ఓసారి ఆలోచించుకుంటే మంచిది. మీ స్థాయి ఏమిటో మర్చిపోవద్దు. మీకంత సీన్ లేదు అన్న విషయం గుర్తుపెట్టుకోవాలి'' అంటూ హితవు పలుకుతున్నారు. కాగా ఆసియా కప్-2023 పాక్లో జరుగనుండగా.. వన్డే వరల్డ్కప్-2023 భారత్లో నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**